# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
24-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 6

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## 2028లోనూ రేవంతే సీఎం!



### కాంగ్రెస్ పార్టీ సీనియర్లకు షాక్

తన మంత్రివర్గంలో సిద్దిపేట ఎమ్మెల్యే కు మంత్రి పదవి

సిద్దిపేట రైతు భరోసా సభలో రేవంత్ రెడ్డి క్లారిటీ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

స్వల్ప కాలంలోనే సీఎంగా.. స్వల్ప కాలంలో కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు రేవంత్ రెడ్డి.

తెలంగాణకు మరోసారి రేవంత్ సీఎం అవుతారా? కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరోసారి ఆయనే ముఖ్యమంత్రి కావడం ఖాయమా? అంటే అవుననే అంటున్నారు రేవంత్ రెడ్డి. సిద్దిపేట సభలో ఫుల్ క్లారిటీ ఇచ్చారు. మరోసారి తెలంగాణ రాష్ట్రానికి తానే సీఎం అని.. సిద్దిపేట నుంచి గెలిచినవారు తన మంత్రివర్గంలో పని చేస్తారు అని తేల్చి చెప్పారు. దీంతో సొంత పార్టీలో సీనియర్లకు షాక్ ఇచ్చారు. అదే సమయంలో గులాబీ పార్టీకి సైతం గట్టి హెచ్చరికలు పంపారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో రేవంత్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి

### మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం

- నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ
- ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు... మాది స్మార్ట్ గవర్నెన్స్
- శాసనమండలిలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు

2లో

## తెలంగాణ బిజెపిలో విభేదాలు!

### నేతల మధ్య బిగ్ ఫైట్





**ఆధిపత్యం కోసం ఆరాటం**


గ్రేటర్ అభ్యర్థుల ఎంపికను ఎంపీలకు విడిచి పెట్టాలని ఈటెల రాజేందర్ డిమాండ్

**సొంత పార్టీ నేతలు గోతులు తవ్వుతున్నారని ఆవేదన**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర చీఫ్ ఎదుట పంచాయితీ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ బిజెపిలో విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయా? పార్టీలో నేతలు ఒకరిపై ఒకరు కుట్రలు చేసుకుంటున్నారా? బిజెపి రాష్ట్ర నాయకత్వం సరైన నిర్ణయాలు తీసుకోవడం లేదని నాయకులు కలత చెందుతున్నారా? గ్రేటర్ లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎంపీలకు ప్రాధాన్యత లేకుండా పోతుందా? ఈ విషయంలో పార్లమెంట్ సభ్యులు ఆగ్రహం గా ఉన్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ వీటిని ధ్రువీకరిస్తూ చేసిన వ్యాఖ్యలు

- మిగతా 2వ పేజీలో



## దానం కేసు మళ్లీ మొదటికి

- పార్టీ ఫిరాయింపుపై నాగేందర్ కు హైకోర్టు నోటీసులు
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు కూడా
- బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్ పై విచారణ
- వివరణ ఇవ్వాలని ఇరువురికీ ఆదేశం

2లో

## తమిళనాడు ప్రచార బాధ్యతలు పవన్ కళ్యాణ్‌కు!

**బిజెపి పెద్దలనుంచి ప్రత్యేక ఆహ్వానం**

**బలమైన ద్రవిడ సిద్ధాంతాన్ని ఢీకొట్టేందుకు పవన్ సనాతన నినాదం**

**ఢిల్లీ పెద్దల వ్యూహం అదే**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కీలక బాధ్యతలు అప్పగించింది బిజెపి హై కమాండ్. తమిళనాడు ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ కు ప్రచార బాధ్యతలు అప్పగించింది. అక్కడ ఎన్నికల్లో పవన్ సేవలను ఉపయోగించుకోవాలని చూస్తోంది.

- మిగతా 4వ పేజీలో



## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

### యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి

**న్యూఢిల్లీ, క్రైమ్ మిర్రర్:** పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ..

## పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు



- మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు చంద్రబాబు శంకుస్థాపన
- హాజరైన కేంద్రమంత్రులు కుమారస్వామి
- ఏటా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యం

## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

2లో

### రైతుబంధును 15 వేలు అని,12వేలకు కుదింపు

- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయరా?
- బడ్జెట్‌పై చర్చలె బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, క్రైమ్ మిర్రర్:** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని

## ఇరాన్‌తో చర్చలు.. 5 రోజులు దాడులకు విరామం


### హర్మూజ్ జలసంధి ఉద్రిక్తతల మధ్య ట్రంప్ కీలక ప్రకటన

- చర్చలు సానుకూలం.. దాడులను వాయిదా వేయాలని సైన్యానికి ఆదేశం
- ఇంధన కేంద్రాలపై దాడులు తాత్కాలికంగా నిలిపివేత
- చమురు ధరలు భారీగా తగ్గదల.. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రభావం
- 'ట్రంప్ వెనక్కి తగ్గారు' అంటూ ఇరాన్ వ్యాఖ్యలు
- అమెరికాతో చర్చలే లేవని గలీబాఫ్ ఖండన
- హర్మూజ్ మూసివేత హెచ్చరికలు కొనసాగింపు



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిని

2,4లో



## నేడే రైతు భరోసా నిధులు

- రైతుల ఖాతాల్లోకి జమ కానున్న పెట్టుబడి సాయం
- సిద్దిపేట జిల్లా నర్మెట్టలో విడుదల చేసిన ముఖ్యమంత్రి
- ఈసారి మూడు విడతలుగా రైతు భరోసా నిధులు
- తొలి విడతలో 70 మందికి రూ.3600 కోట్ల సాయం





## ఎన్నికల అజెండా విస్మరించిన కాంగ్రెస్

రూ.12 వేలకు తగ్గించారని అన్నారు. మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలని అడిగిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక సీజన్‌కే ఇస్తున్నారని అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ' మొదటి బ్జడెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇవ్వాలి. బ్జడెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బ్జడెట్‌లో మాయమైంది. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బ్జడెట్‌లలో పెట్టారు. ఒక్కసారి కూడా ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బ్జడెట్‌లో చెప్పారు. ఈసారి ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. బ్జడెట్‌పై చర్చలో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలను ఆయన ఎండగొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు సీజన్‌లలో రైతు భరోసాను ఎగ్గింటిందని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు ఎన్నికల అజెండాలో కూడా పెట్టారని హరీష్‌రావు గుర్తుచేశారు. తొలి బ్జడెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దాన్ని రూ.12 వేలకు తగ్గించారని మండిపడ్డారు. మా ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక ఒక పంటకే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ.. రుణామాఫీ చేశామని గొప్పలు చెప్పుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.'మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లుగా ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్జడెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు.

# 2028లోనూ రేవంతే సీఎం!

తెలంగాణ ఇచ్చిన పార్టీగా 2014 ఎన్నికల్లో ప్రజలు గుర్తించలేదు. 2018 ఎన్నికల్లోను ఓటమి తప్పలేదు. కాంగ్రెస్ పార్టీలో కాకలు తీరిన యోధులు కూడా ఉండేవారు. కానీ వారంతా నిస్పహాయత వ్యక్తం చేసేవారు. అటువంటి సమయంలోనే కాంగ్రెస్ పార్టీలోకి ప్రవేశించారు రేవంత్ రెడ్డి. ముందుగా పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆ పదవితోనే కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. సుదీర్ఘ పాదయాత్రతో తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ అని ప్రజలను గుర్తు చేశారు. ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. దానిని తెలంగాణ ప్రజలు గుర్తించి కాంగ్రెస్ ను గెలిపించారు.

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది.

# దానం కేసు మళ్లీ మొదటికి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపునకు సంబంధించిన వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. నాగేందర్ పార్టీ మారలేదని, ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అంటూ అసెంబ్లీ స్పీకర్ తీర్పునిచ్చినా.. హైకోర్టు మాత్రం షాకిచ్చింది. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన హైకోర్టు నాగేందర్ కు నోటీసులు జారీ చేసింది. ఆయనతోపాటు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ కు కూడా నోటీసులు ఇచ్చింది.బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ పై అనర్హత కేసు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తనతోపాటు కాంగ్రెస్లో చేసిన మరో 9 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలేనంటూ స్పీకర్ ఇటీవల తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. అయితే 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నాగేందర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోకసభ స్థానం నుంచి పోటీ చేశారు. దీంతో ఇదే అంశాన్ని పేర్కొంటూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దానంపై అనర్హత వేటు వేయాలని కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఒక పార్టీనుంచి ఎన్నికైన అభ్యర్థి.. మరో పార్టీ టికెట్పై ఎంపీగా పోటీ చేయడం చట్ట విరుద్ధమని, ఇది చట్టాన్ని ఉల్లంఘించడమేనని పిటిషన్‌లో తెలిపారు. ఈ నేపథ్యంలో దానం 2024లో ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ సమర్పించిన నాటి నుంచే ఆయన పై అనర్హత వేటు వేయాలని అన్నారు. అంతేకాదు.. గతంలో ఇతర రాష్ట్రాల్లో ఇలానే చేసిన వారిపై సుప్రీంకోర్టు తీవ్రంగా



మండిపడిందని.. తీర్పులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ధర్మాసనం.. దానం నాగేందర్ సహా.. అసెంబ్లీ స్పీకర్ కు కూడా నోటీసులు జారీ చేసింది. ఒక పార్టీ తరఫున అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తూ.. మరో పార్టీ టికెట్ పై ఎలా పోటీ చేస్తారని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

## దానంకు అగ్నిపరీక్ష..

ఇన్నాళ్లుగా బీఆర్ఎస్ వేసిన పిటిషన్ పై విచారణ ఎదుర్కొన్న దానం నాగేందర్ కు పెద్దగా ఇబ్బంది ఎదురుకాలేదనే చెప్పాలి. వారి పిటిషన్ ను విచారించింది స్పీకరే కావడం, అది కూడా తీవ్ర జాప్యం చేయడంతో దానంతోపాటు ఫిరాయింపు ఎమ్మెల్యేలంతా అనర్హత వేటు విషయంలో ఎటువంటి ఆందోళన చెందలేదు. చివరికి సుప్రీంకోర్టు ఆదేశంతో ఎమ్మెల్యేలను విచారించిన స్పీకర్ తుదితీర్పును ఇవ్వడంతో అందరికీ ఊరట లభించినట్లయింది. కానీ, స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. ప్రత్యేకించి కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేయడం ద్వారా దానం పార్టీ మారినట్లు చెప్పడానికి బలమైన సాక్ష్యాలను మహేశ్వరరెడ్డి సమర్పించారు. దీంతో ఇప్పుడు ఏం జరగనుందన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనిని దానంతోపాటు అధికార కాంగ్రెస్ ఎలా ఎదుర్కొంటుందో చూడాల్సి వుంది. నిజానికి 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడంతో.. మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్లో చేరతారన్న ప్రచారం మొదలైంది. దీంతో ఆ ఎమ్మెల్యేల చేరికలకు అడ్డుకట్ట వేసేందుకే దానంపై బీజేపీ హైకోర్టుకు వెళ్లిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణ బిజెపిలో విభేదాలు!



(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు బిజెపిలో సెగలు పుట్టిస్తున్నాయి. సాక్షాత్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఎదుటే ఈటెల రాజేందర్ ఈ సంచలన ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది.

**గులాబీ పార్టీలో అగ్రనేతగా..**

తెలంగాణ రాష్ట్ర సమితిలో ఒక వెలుగు వెలిగారు ఈటెల రాజేందర్. కానీ అనుకోని రీతిలో ఆయన బిజెపిలో చేరారు. భారతీయ జనతా పార్టీలో తనకు సరైన ప్రాతినిధ్యం దక్కుతుందని భావించారు. ముఖ్యంగా బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి వరిస్తుందని ఆశపడ్డారు. బిజెపి నాయకత్వం మాత్రం ఆది నుంచి పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. ఈటెల రాజేందర్ పేరును పరిగణలోకి తీసుకున్నట్టే తీసుకుని ఆయనకు మొండి చేయి చూపింది. అప్పటినుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్నారు ఈటెల రాజేందర్. మరోవైపు మరో కేంద్రమంత్రి బండి సంజయ్ తో ఆయనకు విభేదాలు ఏర్పడ్డాయి.. హుజురాబాద్ లో ఓడిపోయిన రాజేందర్ సార్వత్రిక ఎన్నికల్లో మల్కాజ్గిరి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అయితే తన సొంత అసెంబ్లీ నియోజకవర్గం హుజురాబాద్ కు ఎంపీగా బండి సంజయ్ ఉన్నారు. అయితే అక్కడ తన వర్గాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపిస్తూ వచ్చారు. అప్పటినుంచి బండి సంజయ్ తో విభేదాలు కొనసాగుతున్నాయి. పార్టీ నాయకత్వం సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఈటెల రాజేందర్ కంటే బండి సంజయ్ పై చేయి సాధించారు. దీంతో విభేదాలు మరింత తారాస్థాయికి చేరాయి.

**పార్లమెంట్ పరిధిలో మా ఇష్టం..**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కదలిక వచ్చింది. అయితే ఇప్పుడే ఈటెల రాజేందర్ ఒక షరతు పెడుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎంపీలకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర నాయకత్వం ప్రభావం ఉండకూడదని భావిస్తున్నారు. ఎవరి పార్లమెంటు నియోజకవర్గాల్లో వారే అభ్యర్థులను డిసైడ్ చేస్తారని.. ఇప్పటికే తన సాటి ఎంపీలైన రఘునందన్ రావు , కొండా విశ్వేశ్వర్ రెడ్డి తో పాటు సర్వేలు జరుపుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇటీవల బీజేపీ కార్యవర్గాల ఎంపిక కోసం పరిశీలకులను నియమించారు. అయితే దానిపై మాట మాత్రం కూడా ఈటెల రాజేందర్ కు చెప్పకుండా మల్కాజిగిరి పార్లమెంటు స్థానాల్లో నియామకాలు జరిపారు. దీంతో మరింత ఫైర్ అవుతున్నారు ఈటెల. కనీసం సీనియర్ నేతగా, పార్టీ ఎంపీగా గుర్తించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సొంత పార్టీ నేతలే కుట్ర..**

ఈటెల రాజేందర్ బిజెపిని వీడుతారని సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. బిజెపిలో తగిన ప్రాధాన్యం లేకపోవడంతో తిరిగి గులాబీ పార్టీలోకి వెళ్లిపోతారని టాక్ నడిచింది. అయితే ఈ ప్రచారం వెనుక సొంత పార్టీ నేతలు ఉన్నారని ఈటెల రాజేందర్ అనుమానిస్తున్నారు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ బిజెపి అధ్యక్షుడు ఎదుట కుండ బద్దలు కొట్టి మాట్లాడారు. సొంత పార్టీ నేతలే నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని.. విభేదాలకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వచ్చే నెలలో ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన ఉంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతోపాటు 2028 అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ చేసుకోనున్నారు. పక్క పొలిటికల్ వ్యూహంతోనే ఆయన పర్యటన కొనసాగనుంది. ఇంతలోనే ఈ విభేదాలు చూస్తుంటే మాత్రం భారతీయ జనతా పార్టీలో ఒక రకమైన కలవరం నెలకొంది.

# నేడే రైతు భరోసా నిధులు

తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్. యాసంగి సీజన్ కు సంబంధించి రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఈ నిధులను విడుదల చేశారు. సోమవారం రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఈసారి మూడు విడతల్లో భరోసా నిధులు అందనున్నాయి. తొలి విడతలో దాదాపు రూ. 3,600 కోట్ల మొత్తాన్ని 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగానే రైతు భరోసా నిధుల విడుదలను ప్రారంభించారు. ఆదివారం సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో వేదికపై నుంచే ల్యాప్ టాప్ లో మీట నొక్కి నిధులను విడుదల చేశారు. రాష్ట్రంలోని రైతులందరికీ సోమవారం నుంచి వారి ఖాతాల్లో చేరనున్నాయి. అయితే ఈసారి మొత్తం మూడు విడతల్లో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందులోనూ ఆసక్తికరమైన విధానాన్ని అనుసరించనున్నారు. దీని ప్రకారం.. తొలి విడతలో ఒక ఎకరం భూమికి రైతుభరోసా సాయం అందజేయనున్నారు. అంటే.. ఒక రైతుకు ఎన్ని ఎకరాలున్నా సరే తొలి విడతలో ఎకరానికి మాత్రమే సాయం అంధజేస్తారు. ఆ తరువాత రెండో విడతలో ఎన్ని ఎకరాలు అని నిర్ధారిస్తే ఒక్కో రైతుకు అన్ని ఎకరాలకు పెట్టుబడి సాయం అందిస్తారు. కాగా, తొలి విడతలో ఆదివారం దాదాపు రూ. 3,600 కోట్ల మొత్తాన్ని 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రేపటిలోగా రైతుల ఖాతాలోనూ 'రైతు భరోసా' నిధులు జమ అవుతాయని చెప్పారు. మిగిలిన రూ. 5,400 కోట్లను మరో రెండు విడతలలో విడుదల చేయనున్నట్టు తెలిపారు. మరో 20 రోజులలో రూ. 2,700 కోట్లు, ఆ తర్వాత 20 రోజుల్లో మరో రూ. 2,700 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్టుగా చెప్పారు. మొత్తంగా 45 రోజులలో రాష్ట్రంలోని రైతుల ఖాతాల్లో రైతు భరోసా కింద రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని తెలిపారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని చెప్పారు. రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ. 6 వేల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేస్తుంది. మొత్తంగా మూడు విడతలలో రాష్ట్రంలోని 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ. 9 వేల కోట్లు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ చేయనున్నట్టుగా తెలిపింది. ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన తర్వాత... దరఖాస్తు సమయంలో రైతులు సమర్పించిన మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు వస్తాయి. తద్వారా రైతులు తమ అకౌంట్లలో రైతు భరోసా నిధులు పడ్డాయో? లేదో? చెక్ చేసుకోవచ్చు. లేకపోతే బ్యాంక్ స్టేట్‌మెంట్ చెక్ చేసుకోవడం ద్వారా కూడా తమ అకౌంట్‌లలో నిధులు జమ అయ్యాయా? లేదా? అనేది తెలుసుకునే వీలు ఉంది.

# హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి

మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు.

# ఎస్‌సీఈయూ--సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ బ్లడ్ డొనేషన్



**మందమర్రి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్):** అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఎస్‌సీఈయూ--సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.స్థానిక మదర్ థెరిసా హైస్కూల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (మంచిర్యాల) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి కార్మికులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీఎం (పర్సనల్) అశోక్ మాట్లాడుతూ, కార్మిక సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదాతలను ప్రోత్సహించడంలో యాజమాన్యం ముందుంటుందని తెలిపారు.యూనియన్ జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ,దేశ స్వాతంత్ర్యానికి ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ త్యాగం తరతరాలకు స్ఫూర్తి అని అన్నారు.వారి జ్ఞాపకార్థం రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.తలసేమియా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ,జిల్లాలో వందలాది తలసేమియా బాధితులకు రక్తం అవసరం ఉంటుందని,ఇటువంటి శిబిరాలు వారికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ శిబిరంలో సింగరేణి కార్మికులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని సుమారు 80 నుంచి 100 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.రక్తదానం ప్రాణాలను కాపాడే మహత్తర సేవ అని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు,గనుల కార్మికులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న గజెల్లి సునీత...!

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ మరియు చేనేత ఐక్య వేదికల సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మపురి వాస్తవ్యురాలు మరియు ప్రఖ్యాత విద్యావేత్త అయిన శ్రీమతి గజెల్లి సునీత కి, ఆమె విద్యా రంగంలో విశేష సేవలందించినందుకు 'ఉగాది పురస్కారం' లభించింది. ఈ అవార్డును ప్రముఖ మాజీ మంత్రి మరియు సినీ నటులు శ్రీ బాబు మోహన్ చేతుల మీదుగా, చేనేత ఐక్య వేదిక రాష్ట్ర రాపోలు వీరమోహన్ సమక్షంలో అందుకోవడం జరిగింది.?శ్రీమతి గజెల్లి సునీత రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకోవడం పట్ల పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. వారిలో ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, మండల విద్యాధికారి (MEO) సీతా లక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ అరుదైన గౌరవం ధర్మపురి ప్రాంతానికే గర్వకారణమని వారు కొనియాడారు.

# ప్రజా వాణి కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డీసీ ని కలిసిన రాజన్న టీమ్






**ప్రధాన సమస్యలపై ఫిర్యాదు**

**కూకట్ పల్లి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్) :** మూసాపేట్ మున్సిపల్ కార్యాలయం లో జరిగిన ప్రజా వాణి కార్యక్రమంలో రాజన్న టీమ్ సభ్యులు బుల్లెట్ రవి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డీసీ ని కలిసి పలు ప్రధానమైన సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఎల్లమ్మ బండలోని కొత్త వాటర్ ట్యాంకు వద్ద రోడ్డు వేసి చాలా రోజులు అయినా కూడా పేరుకుపోయిన మట్టిని తొలగించలేదని వెంటనే తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇట్టి వాటర్ ట్యాంక్ నుండి ఆల్విన్ కాలనీ ఎల్లమ్మ బండ వాటర్ సప్లై అవుతున్న తరుణంలో వాటర్ ట్యాంక్ వద్ద భద్రత కరువైందని. రాత్రుల పూట గంజాయి తాగే బ్యాచ్ లు కూర్చొని గంజాయి సేవించడంతో పాటు స్థానికులకు అభద్రతను కల్పిస్తున్నారని, ఇట్టి వాటర్ ట్యాంక్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. 24 గంటలు వాచ్మెన్ ఉంచడం ద్వారా అసాంఘిక చర్యలు ఏవి జరగకుండా స్థానికులకు మేలు చేయగలరని కోరారు. ఎల్లమ్మ బండలో భారతీయ విద్యాలయ స్కూల్ వద్దగల కమ్యూనిటీ హాల్ నందు కొంతమంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా వారి పార్టీ బ్యానర్లు కమ్యూనిటీ హాల్ లోపల పెట్టడం, వారి సొంత వాహనాలు అక్కడ పార్కు చేసుకోవడం మిగతా 18 కాలనీల కు చెందిన వాసులకు అందుబాటులో లేకపోవడం చాలా విచారకరంగా మారిందని ఇట్టి కమ్యూనిటీ హాల్ అన్ని కాలనీవాసులు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, వెంటనే ఫ్లెక్సీలను తొలగించి అట్టి వ్యక్తుల చెర నుండి కమ్యూనిటీ హాల్ కి రక్షణ కల్పించి అన్ని కాలనీలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని డీసీ ని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాకేష్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో కాగడాల జ్వాలలు


**బాలానగర్‌లో మారుమోగిన విప్లవ నినాదాలు**



**బాలానగర్, మార్చి 23 (క్రైమ్ మిర్రర్):** బాలానగర్ డివిజన్ పరిధిలో సోమవారం షహీద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా డి.వై.ఎఫ్.ఐ, ఐద్వా, సిఐటీయు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా కాగడాల ర్యాలీ నిర్వహించారు. రాజుకాలనీ గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ స్థానిక ప్రధాన వీధుల గుండా సాగుతూ ప్రజల్లో దేశభక్తి జ్వాలలు రగిలించింది. కాగడాల కాంతులతో ముందుకు సాగిన కార్యకర్తలు విప్లవ నినాదాలతో ప్రాంతాన్ని మారుమోగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటీయు నాయకులు రాజశేఖర్, డి.వై.ఎఫ్.ఐ నాయకులు చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ త్యాగం యావత్ భారతదేశానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. యువతలో చైతన్యం కలిగించడమే ఈ ర్యాలీ లక్ష్యమని తెలిపారు. వారు ఇంకా మాట్లాడుతూ, భగత్ సింగ్ కలలు కనిన సమానత్వ సమాజం ఇప్పటికీ పూర్తిగా ఆవిష్కృతం కాలేదని, పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, కార్మికులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం అవసరమని అన్నారు. యువత, కార్మికులు, మహిళలు ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ ఆలోచనలు కేవలం చరిత్రలో మాత్రమే కాకుండా నేటి సమాజంలో కూడా మార్గదర్శక శక్తిగా నిలుస్తాయని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం నిరంతర పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు భగత్ సింగ్ అమర్ రహే, ఇంక్విలాబ్ జిందాబాద్, యువత ఒక్కటైతే మార్పు సాధ్యం వంటి నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగడాల ర్యాలీని చూసేందుకు స్థానిక ప్రజలు భారీగా చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణిదీప్, ఐద్వా నాయకురాలు విజయ, భాగ్యలక్ష్మి, ఉమారాణి, సిఐటీయు శంకర్, ధర్మారావు, రాము, వెంకటయ్య విద్యార్థులు, మహిళలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని భగత్ సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

# వేసవికాలంలో మంచినీటి కొరత రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

**వాటర్ వర్క్స్ డీజీఎమ్ త్రినాథ్ ని కలసి వినతి పత్రం అందించిన మందలపు సాయిబాబా చౌదరి**



**కూకట్ పల్లి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బి సర్కిల్ వాటర్ వర్క్స్ డీజీఎమ్ త్రినాథ్ ని కెపిహెచ్బి కాలనీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని వసంత నగర్ పరిసర కాలనీలలోని అన్ని ఫేజ్ లకు నీటి సరఫరా సక్రమంగా అందించాలని వినతి పత్రాన్ని అందించారు. డీజీఎమ్ త్రినాథ్ కి ఈ నియోజకవర్గంలో పూర్తి అవగాహన ఉందని పూర్వం ఆయన చేసిన పనితీరుని ఆయనకు గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత చేస్తున్న అభివృద్ధి ఫలాలను అట్టడుగు నా ఉన్న ప్రతి పేదవారికి అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆదేశాల మేరకు ప్రతి కాలనీలో తిరుగుతూ ప్రజా సమస్యలపై ముందుకు సాగుతున్నామని తెలియజేశారు. కాబట్టి ఈ వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా సవ్యంగా జరగాలని డీజీఎమ్ త్రినాథ్ ని ఆయన కోరారు.



# భారీ బందోబస్తు నడుమ మిర్యాల సంత వేలం పాట

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** నూతనకల్ మండలంలోని మిర్యాల గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే పశువుల సంత వేలం పాట సోమవారం నిర్వహించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని వేలంపాటకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ అనంతుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పంచాయితీ అధికారులు ఆసక్తి గల వ్యక్తుల నుండి డిపాజిట్ తీసుకొని వేలంపాట నిర్వహించారు. 9 మంది వేలంలో పాల్గొనగా యమగాని రమేష్ 14 లక్షల 32 వేల రూపాయలతో సంతను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ శశికళ, పంచాయితీ కార్యదర్శి ఏ.అనిల్,తాళ్లపల్లి వెంకన్న,గంగరాజు, రాజేష్,సీఐ నాగేశ్వరరావు, ఎస్సైలు నాగరాజు, క్రాంతి కుమార్,దరిపెల్లి వీరన్న, ఇరుగు కిరణ్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# యువత దేశ భక్తిని పెంపొందించుకోవాలి

**చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్**




**చౌటుప్పల్,మార్చి 23, ప్రైమ్ మిర్రర్:** భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత దేశభక్తిని అలవర్చుకోవాలని చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని స్థానిక నలంద కళాశాలలో భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకొని డ్రగ్స్, గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసలు కావద్దని కళాశాల విద్యార్థులకు సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐ మన్మధకుమార్ పాల్గొని మాట్లాడుతూ... నేడు యువత చరవాణిలకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి గొప్ప స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.అలాగే మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు తోడ్పడాలని అన్నారు.డ్రగ్స్, గంజాయిపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకత్వాన్ని ఆయన అభినందించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక 16 వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మదాసు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఖయ్యూం,జీఎంపీస్ నాయకులు బండారు నరసింహ,డాక్టర్ కాటమరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తిగుళ్ల శ్రీనివాస్, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రత్నం,శ్రీకాంత్, నాయకులు గండని లక్ష్మీపతి,పల్లె శివకుమార్, తూర్పునూరు మల్లేశం, ఎండి కాసిం, నక్క లింగస్వామి, షబ్బీర్, కొండే శీను, బండారు విక్రమ్,యిట్టబోయినా శివ, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**చౌటుప్పల్, మార్చి 23,క్రైమ్ మిర్రర్ :** చేనేత పరిశ్రమ,చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 25వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద జరిగే రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు గోశిక స్వామి, అధ్యక్షులు గుర్రం నరసింహ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 25న హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద జరిగే చేనేత రిలే నిరాహార దీక్షకు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయవలసిందిగా కోరారు. ప్రభుత్వం చేనేత పరిశ్రమ,చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతి కుమార్, కార్యదర్శి ముషం నరహరి, యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు గోశిక స్వామి, అధ్యక్షులు గుర్రం నరసింహ, సహాయ కార్యదర్శి కందగట్ల ఆనంద్, కటబత్తిని భీమయ్య, నాయకులు కందగట్ల కిషన్, సుంకి రవి,కర్నాటి జనార్ధన్, శ్రీశైలం, జెల్ల శ్రీనివాసులు,కడవెరి శంకరయ్య,మిర్యాల సత్తయ్య, గోశిక అంజయ్య, వెంకటేశం, పురుషోత్తం,లక్ష్మయ్య, పూర్ణచందర్,గుర్రం కృష్ణ, పాండురంగం,రుద్ర యాదగిరి, భక్తుల గణేష్, రాపోలు లక్ష్మీనారాయణ,వనం వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.



# ఇరాన్‌తో చర్చలు.. 5 రోజులు దాడులకు విరామం

(మొదటి పేజీ తరువాయి)

తెరవాలంటూ ఇరాన్‌కు గడువు విధించిన నేపథ్యంలో, ప్రస్తుతం జరుగుతున్న చర్చల కారణంగా ఇరాన్‌పై దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. గత రెండు రోజులుగా ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని ఇంధన మౌలిక వసతులు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజులపాటు వాయిదా వేయాలని సైన్యానికి ఆదేశించినట్లు తెలిపారు. చర్చల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో వెంటనే ప్రభావం కనిపించింది. ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి. ఒకే రోజులో గణనీయంగా తగ్గి, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి తగ్గిన సంకేతాలు కనిపించాయి. మరోవైపు, ట్రంప్ ప్రకటనపై ఇరాన్ భిన్నంగా స్పందించింది. తమ హెచ్చరికల కారణంగానే అమెరికా వెనక్కి తగ్గిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార మాధ్యమం పేర్కొంది. అయితే ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గలీబాఫ్ మాత్రం అమెరికాతో ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. మార్కెట్లను ప్రభావితం చేయడానికే తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇదిలా ఉండగా, తమ విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. ఆ కేంద్రాల పునర్నిర్మాణం పూర్తయ్యే వరకు జలసంధిని తెరవబోమని తేల్చిచెప్పింది. అంతేకాకుండా ఇజ్రాయెల్ ఇంధన, సమాచార సాంకేతిక సదుపాయాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించింది. మొత్తంగా, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తాత్కాలికంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నప్పటికీ పరిస్థితి ఇంకా సున్నితంగానే ఉంది. చర్చల ఫలితాలపై భవిష్యత్ పరిణామాలు ఆధారపడి ఉండనున్నాయి.





ప్రస్తుత తరుణంలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఒక అదృశ్య శత్రువు పట్టి పీడిస్తోంది. అదే గంజాయి . ఒకప్పుడు కేవలం మారుమూల అడవులకే పరిమితమైన ఈ విష సంస్కృతి, నేడు నగరాల్లోని అపార్ట్‌మెంట్‌ల వరకు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల హాస్టల్ గదుల వరకు పాకింది. గణాంకాలు చూస్తుంటే గుండె జల్లుమంటోంది. గత రెండు సంవత్సరాల్లోనే గంజాయి సంబంధిత కేసులు 340 శాతం పెరగడం అనేది కేవలం ఒక సంఖ్య కాదు, అది మన సామాజిక ఆరోగ్యానికి ఎదురవుతున్న ప్రమాద హెచ్చరిక. పండ్లలో విత్తనాలు ఎంత సహజంగా కలిసిపోతాయో, మన యువత జీవితాల్లో ఈ మాదక ద్రవ్యం అంతకంటే వేగంగా వేళ్లూనుకుంటోంది.తెలుగు రాష్ట్రాల్లో గంజాయి పెంపకం ఒక వ్యవస్థీకృత నేరంగా మారుతోంది. గతంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతాలకే పరిమితమైన ఈ సాగు, ఇప్పుడు అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం, మరియు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం వంటి జిల్లాల్లో విస్తరించింది. సాధారణ పంటల కంటే గంజాయి సాగులో ఆదాయం 3 నుంచి 5 రెట్లు ఎక్కువగా ఉంటుంద.గిరిజన ప్రాంతాల్లోని అమాయక రైతులను స్మగ్లర్లు డబ్బు ఆశ చూపి లేదా భయపెట్టి ఈ రొంపిలోకి దింపుతున్నారు.పండించిన పంటను నేరుగా పొలాల వద్దే కొనుగోలు చేసే వ్యవస్థను మాఫియా ఏర్పాటు చేసుకుంది. ఇటీవల కొన్ని పట్టణ ప్రాంతాల్లో హైడ్రోపోనిక్స్ పద్ధతిలో ఇళ్లలోనే గంజాయి పెంచుతున్న ఉదంతాలు వెలుగులోకి రావడం గమనార్హం. ఇది పోలీసు వ్యవస్థకు కొత్త సవాలుగా మారింది.నేటి యువతలో గంజాయి వాడకం ఒక స్టేటస్ సింబల్ గా లేదా స్ట్రెస్ రిలీవర్ గా చలామణి అవుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో ఇంజనీరింగ్ మరియు మెడికల్ విద్యార్థులు ఈ మత్తులో చిక్కుకుంటున్నారు. మానసిక ఆరోగ్య నిపుణుల అంచనా ప్రకారం, 18-35 ఏళ్ల మధ్య ఉన్న యువతలో సుమారు 3-5 శాతం మంది కనీసం ఒక్కసారైనా గంజాయి రుచి చూశారు. 2020లో క్రమం తప్పకుండా వాడేవారి సంఖ్య 0.8 శాతం ఉండగా, 2025 నాటికి అది దాదాపు రెట్టింపు అవ్వడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. స్నేహితుల మధ్య వెలికిపోతామనే భయంతో చాలామంది మొదలుపెడుతున్నారు.వెబ్ సిరీస్‌లు మరియు సినిమాల్లో ధూమపానాన్ని, మత్తును గ్లామరైజ్ చేయడం యువతను తప్పుదోవ పట్టిస్తోంది. డార్క్ వెబ్ మరియు ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా డ్రగ్స్ డెలివరీ సులభతరం అయ్యింది.గంజాయి వాడకం వల్ల కలిగే నష్టాలు కేవలం ఆరోగ్యానికే పరిమితం కావు, అవి వ్యక్తిగత మరియు సామాజిక విచ్ఛిన్నానికి

## తెలుగు రాష్ట్రాల్లో గంజాయి మహమ్మారి

## యువత భవితకు పొంచి ఉన్న ముప్పు!

దారితీస్తాయి.మెదడుపై తీవ్ర ప్రభావం ,25 ఏళ్ల లోపు వయస్సులో మెదడు ఇంకా అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఈ సమయంలో గంజాయి వాడటం వల్ల జ్ఞాపకశక్తి మందగించడం, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. నిర్ణయాధికారం దెబ్బతిని, యువత తప్పుడు మార్గాల్లోకి వెళ్తున్నారు. మానసిక రుగ్మతలు ముఖ్యంగా దీర్ఘకాలిక వినియోగం వల్ల స్కిజోఫ్రెనియా, తీవ్రమైన ఆందోళన (Anxiety), మరియు మాంద్యం (Depression) వచ్చే అవకాశం 3-5 రెట్లు పెరుగుతుంది. హైదరాబాద్ నిమ్హాన్స్ వంటి ఆసుపత్రుల్లో చేరుతున్న వ్యసనపరుల్లో దాదాపు సగం మంది గంజాయి బాధితులే ఉండటం విషాదకరం. ఒక అధ్యయనం ప్రకారం, గంజాయికి బానిసైన వ్యక్తి యొక్క పని సామర్థ్యం తగ్గిపోవడం వల్ల వారి జీవితకాల ఆదాయంలో 30-40 శాతం కోత పడుతుంది. ఇది కేవలం వ్యక్తిగత నష్టమే కాదు, దేశ ఉత్పాదకతకు కూడా గొడ్డలిపెట్టు. తెలుగు రాష్ట్రాలకు ఏటా దాదాపు 1000-1500 కోట్ల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లుతోందని అంచనా.ప్రభుత్వాలు ఈ సమస్యను కేవలం నేరంగా చూడకుండా, ఒక సామాజిక రుగ్మతగా పరిగణిస్తున్నాయి. డ్రోన్ల సాయంతో అడవుల్లో సాగును కనిపెట్టడం, 15,000 ఎకరాలకు పైగా పంటను ధ్వంసం చేయడం వంటి చర్యలు చేపట్టారు.గత ఏడాది సుమారు 8,500 మందిని అరెస్ట్ చేసి, 450 టన్నుల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు సైబర్ ఫోరెన్సిక్స్ ద్వారా డార్క్ వెబ్ లావాదేవీలను ఛేదిస్తున్నారు.కేవలం లాఠీలు, జైళ్లతో ఈ సమస్య పరిష్కారం కాదు. దీనికి ఒక సమగ్రమైన బహుముఖ వ్యూహం అవసరం. తల్లిదండ్రుల పాత్ర. మీ పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించండి. వారు అకస్మాత్తుగా ఒంటరిగా ఉండటం, చదువులో వెనుకబడటం లేదా వింతగా ప్రవర్తిస్తుంటే వారితో స్నేహపూర్వకంగా మాట్లాడండి. వారిపై గూఢచార్యం చేయకుండా, వారికి భరోసానిచ్చే తండ్రిగా/తల్లిగా మారండి. విద్యాసంస్థల బాధ్యత గా ప్రతి కళాశాలలో కౌన్సిలింగ్ కేంద్రాలు ఉండాలి. చదువుతో పాటు ఒత్తిడిని ఎలా జయించాలో నేర్పించే లైఫ్ స్కిల్స్ తరగతులు నిర్వహించాలి. క్రీడలు మరియు ఇతర కళాత్మక కార్యక్రమాల వైపు విద్యార్థులను మళ్లించాలి.గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగు చేసే రైతులకు కాఫీ, మిరియాలు లేదా ఇతర వాణిజ్య పంటలపై అవగాహన కల్పించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. ఉపాధి లభిస్తే వారు నేరాల వైపు వెళ్లరు.మొక్కై వంగనిది మానై వంగునా? అన్నట్లు, గంజాయి వ్యసనం ప్రారంభ దశలోనే అడ్డుకోవాలి. గంజాయి రహిత తెలుగు రాష్ట్రం అనేది కేవలం ప్రభుత్వ నినాదం మాత్రమే కాకూడదు, అది ప్రతి పౌరుడి లక్ష్యం కావాలి. యువత తమ మేధస్సును సృజనాత్మక పనులకు ఉపయోగిస్తేనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. గుర్తుంచుకోండి, ఒక యువకుడు వ్యసనానికి బానిస అయితే ఒక కుటుంబం సర్వనాశనం అవుతుంది. అలాంటి వేలాది కుటుంబాలను కాపాడుకోవడం మనందరి కనీస ధర్మం. మన రాష్ట్రం ఆరోగ్యంగా ఉండాలంటే, మన యువత మత్తులో కాకుండా లక్ష్యాల వైపు పరుగెత్తాలి.మత్తును వీడదాం - మహోన్నత భవిష్యత్తును నిర్మిద్దాం.

డా .సూర్యదేవర రామకృష్ణ ,

9490754169

# తమిళనాడు ప్రచార బాధ్యతలు పవన్ కళ్యాణ్‌కు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం తమిళనాడులో అధికార డిఎంకె కూటమి దూకుడు మీద ఉంది. ఇంకోవైపు అన్నా డిఎంకె నేతృత్వంలోని ఎన్డీఏ తలపడుతోంది. విజయ్ టీవీ కే ఎంట్రీ తో అక్కడ త్రిముఖ పోరు ఉంది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఓట్లతో పాటు సీట్లను పెంచుకోవాలని చూస్తోంది తమిళనాడులో. ఏ చిన్న అవకాశం ఉన్న జార విడుచుకోవడం లేదు. అందులో భాగంగా అక్కడ పవన్ కళ్యాణ్ ను ప్రయోగిస్తోంది. ఇప్పటికే పలుమార్లు పవన్ కళ్యాణ్ తమిళనాడులో పర్యటించారు. అయితే ఈసారి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎక్కువ రోజులు తమిళనాడులో గడపనున్నట్లు తెలుస్తోంది.

**తమిళనాడులో మార్పు..**

హిందుత్వ అజెండాతో ముందుకు సాగాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. గత కొంతకాలంగా తమిళనాడు ఓటర్లలో మార్పు స్పష్టంగా కనిపించింది. ద్రవిడ సిద్ధాంతాల కంటే హిందుత్వవాదం వైపు అక్కడ ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు అర్థమవుతోంది. ఎందుకంటే దశాబ్దాల ద్రవిడ సిద్ధాంతం నేపథ్యంలో అన్య మతాలు ఎక్కువయ్యాయని.. హిందువుల విషయంలో అక్కడ వివక్ష కనబడుతోందని స్పష్టం అవుతోంది. ఈ తరుణంలో సనాతన ధర్మం అంటూ పవన్ కళ్యాణ్ ఇచ్చిన నినాదం అక్కడ బాగానే పనిచేస్తుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో బిజెపి గణనీయంగా పుంజుకుంది. సీట్ల పరంగా వెనుకబడినా.. ఓట్ల పరంగా మాత్రం షేర్ పెంచుకుంటూ పోయింది. ఏకంగా 14 శాతం ఓట్లను సాధించింది. అందుకే ఈసారి మిత్రులతో కలిసి వెళ్తోంది. ఓట్లతో పాటు సీట్లు పెంచుకుంటే భవిష్యత్తులో తమిళనాడుపై పట్టు సాధించేందుకు అవకాశం ఉంటుంది భారతీయ జనతా పార్టీకి.

**ఆది నుంచి పవన్ గురి..**

తాజాగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను బిజెపి ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. బిజెపి కేంద్ర నాయకత్వం నుంచి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు సమాచారం. అయితే ఇప్పటికే ఈ అంశంపై కేంద్ర బిజెపి నాయకత్వం పవన్ కళ్యాణ్ తో ప్రత్యేకంగా మాట్లాడింది. ఆయన చాలా రోజుల కిందట నుంచి తమిళనాడును టార్గెట్ చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అన్న ప్రతిసారి తమిళనాడు నుంచి ద్రవిడ సిద్ధాంత నేతలు బయటకు వస్తున్నారు. కేవలం హిందుత్వ జండాతో బిజెపి ముందుకు వెళుతున్నందున.. పవన్ కళ్యాణ్ అయితే చరిష్మాతో పాటు సనాతన ధర్మం నినాదం పనిచేస్తుందని బిజెపి హై కమాండ్ ఒక అంచనాతో ఉంది.

**మంచి చరిష్మ..**

పవన్ కళ్యాణ్ కు స్టార్ హీరోగా మంచి చరిష్మ ఉంది. మొన్నటి ఎన్నికల్లో శత శాతం విజయంతో జనసేన జాతీయ స్థాయిలో గుర్తింపు కూడా పొందింది. ఏపీకి పక్క రాష్ట్రంగా ఉండగా.. తమిళనాడులో సైతం పవన్ అభిమానులు అధికం. పైగా తెలుగు ప్రజలు ఓ 30 నుంచి 50 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను డిసైడ్ చేయగలరు. అటువంటి చోట పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారం తప్పకుండా వర్కౌట్ అవుతుంది అనేది బిజెపి అంచనా. పైగా అక్కడ సినీ పరిశ్రమతో సైతం మంచి సంబంధాలు ఉన్నాయి పవన్ కళ్యాణ్ కు. బలమైన హిందుత్వవాదంతో బిజెపి.. సనాతన ధర్మ పరిరక్షణతో పవన్ కళ్యాణ్ గట్టిగానే పనిచేస్తారు అనేది బిజెపి అంచనా పెట్టుకుంది. బలమైన ద్రవిడ సిద్ధాంతాన్ని ఢీ కొట్టాలంటే పవన్ కళ్యాణ్ అయితే సరిపోతారని బిజెపి పెద్దలు భావించారు. అందుకే అక్కడ పవన్ కళ్యాణ్ కు ప్రచార బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో??

## పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

అనకాపల్లి: ఏపీ పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు పడింది. ప్రపంచంలోనే అగ్రగామి స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ ఇండియా ఉక్కు కర్మాగారానికి కేంద్ర మంత్రులతో కలిసి, ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట లో ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో 5,465 ఎకరాల్లో 2 దశల్లో దీనిని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు సంస్థ ప్రతినిధులతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలు హాజరయ్యారు. ఈ స్టీల్‌ప్లాంట్ మొత్తం పెట్టుబడి రూ.1,35,964 కోట్లు కాగా.. మొదటి దశలో 2,600 ఎకరాల్లో రూ.80 వేల కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికలు వేశారు. ఈ కర్మాగారంతో లక్ష మందికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆర్సెలార్ మిత్తల్ గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ఎ÷-లాంట్ రెండు దశల్లో సాకారం కానుంది. ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు నిర్మించనున్నారు. క్యాప్టివ్ పోర్టు ద్వారా మరో 6 వేల ఉద్యోగాలు లభిస్తాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా రాకతో విశాఖ రీజియన్ పరిశ్రమల హబ్‌గా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ఎన్‌హెచ్-16తో కలిపేలా 4 లేన్ల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



## 30 వేల మంది నేల ఆరోగ్య స్వచ్ఛంద సేవకులకి శిక్షణ ఇవ్వాలని జయశంకర్ వర్సిటీ పాలకమండలి నిర్ణయం

- ప్రతి రెవిన్యూ గ్రామం లో ఇద్దరు లేదా ముగ్గురికి శిక్షణ
- 2 లక్షల 40 వేల మంది రైతులకు అవగాహన కి ప్రణాళికలు
- 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగం గా పిజేటిఏయూ కీలక నిర్ణయం
- ఉప కులపతి అల్దాస్ జానయ్య



గండిపేట(క్రైం మిర్రర్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రస్తుత పాలకమండలి చివరి సమావేశం ఉపకులపతి అల్దాస్ జానయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశం లో వచ్చే ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ ఆమోదం తో పాటు 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగం గా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారం తో వచ్చే రెండు నెలల్లో ప్రతి రెవిన్యూ గ్రామం నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి నేల ఆరోగ్యం పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నేల ఆరోగ్యం ప్రాముఖ్యత, నేల ఆరోగ్య పరీక్షలు, భూసార కార్డులు, నివేదిక ల రూపకల్పన పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. పిజేటిఏయూ పరిధి లోని 31 రైతు విజ్ఞాన కేంద్రాలు, 15 పరిశోధనా సంస్థల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ పొందిన నేల ఆరోగ్య సంరక్షణ స్వచ్ఛంద సేవకులు తిరిగి ఆయా గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. తద్వారా రైతులు అవసరానికి మించి రసాయన ఎరువుల వాడకం తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేల ఆరోగ్యం సరిగా ఉన్నప్పుడే ఆరోగ్య కరమైన ఆహారోత్పత్తులు పండి తద్వారా మానవ ఆరోగ్యానికి దోహదం చేస్తుందని ఆయన అన్నారు. అంతే కాకుండా ఏ పంటలు వేస్తే రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందో రైతులకు అవగాహన కలుగుతుందని దీని వల్ల పంటల మార్పిడి కి ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు.

**మరో ప్రతిష్టాత్మకమైన**

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని తిరిగి ఈ ఏడాది ఏప్రియల్ 27 వ తేదీ నుంచి మే 25 వ తేదీ వరకూ నిర్వహించడానికి పాలకమండలి ఆమోదం తెలిపిందని జానయ్య వెల్లడించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన 200 బృందాలు రాష్ట్రం లోని వివిధ జిల్లాలలోని సుమారు 1600 గ్రామాలలో పర్యటించనున్నట్లు ప్రకటించారు. ఈ బృందాల సభ్యులు సుమారు 2,40,000 మంది రైతులకు కీలక ఆరోగ్యకరమైన వ్యవసాయ అంశాల పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంతో ఆదరణ లభించందని, రైతులకు ఎంతో ఉపయోగపడిందని జానయ్య వివరించారు. అందుకే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా 2,40,000 రైతులకు రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, మార్కెట్ లో గిరాకీ ఉన్న వరి రకాల సాగు, పంటలమార్పిడి ప్రాముఖ్యత, రాష్ట్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయ సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ రెండు వినూత్న కార్యక్రమాలకి వర్సిటీ పాలకమండలి ఆమోదం తెలిపిందని జానయ్య తెలిపారు.

# తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి, నిర్మాణ రంగానికి కొత్త ఊపిరి

## ప్రజా ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన గాదె శివ

**కూకట్ పల్లి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళు_న్నాయి.

1. 375 గజాల వరకు జీ o6 అంతస్తులకుభవనాలకు అనుమతి ఇవ్వడం,

2. 500 గజాల నివాస స్థలంలో రోడ్డు వెడల్పును అనుసరించి 40 ట్ రోడ్డుకి జీ o8, 60 ట్ రోడ్డుకి జీ o9, 80 ట్ రోడ్డుకి జీ o10 వరకు అంతస్తులకు అనుమతులు కల్పించడం నిర్మాణ రంగానికి గొప్ప ప్రోత్సాహం.టీడీఆర్ వినియోగాన్ని సులభతరం చేసి, భూ యజమానులు, బిల్డర్లకు మరింత అవకాశాలు కల్పించింది. ఇది కేవలం బిల్డర్లకే కాదు---సాధారణ ప్రజలకు కూడా ఒక గొప్ప అవకాశం. గృహ కొనుగోలు దారులకు తక్కువ ధరల్లో ఇళ్లు అందే అవకాశం పెరుగుతుంది. స్క్వేర్ ఫీట్ ధరలు నియంత్రణలోకి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చిన్న, మధ్య తరగతి కుటుంబాలకు ఇది ఒక ఆశాకిరణం. భూమి యజమానులకు కూడా ఈ నిర్ణయాలు పెద్ద ఊరటనిస్తున్నాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో పెరుగుతున్న భూమి విలువలను



దృష్టిలో ఉంచుకుని, తమ స్థలంలో అదనపు అంతస్తులు నిర్మించుకునే అవకాశం రావడం వారికి ఆర్థికంగా లాభదాయకం అవుతుంది. సెట్‌బ్యాక్‌లలో సడలింపులు ఇవ్వడం, టిడిఆర్ వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలు అభివృద్ధి కార్యక్రమాలకు మరింత వేగం తీసుకువస్తాయి. రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఇది బలంగా తోడ్పడుతుంది. ప్రభుత్వం అవసరమైనప్పుడు భూ యజమానులకు టిడిఆర్‌లను ఇవ్వడం, వాటిని బిల్డర్లు సులభంగా కొనుగోలు చేయడం ద్వారా అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడం వల్ల రిజిస్ట్రేషన్లు పెరుగుతాయి, ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. అదే సమయంలో ప్రజలకు తక్కువ ధరల్లో గృహాలు అందుబాటులోకి రావడం ఒక గొప్ప సామాజిక ప్రయోజనం. భవనాల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గతంలో ఉన్న క్లిష్ట విధానాలను సరళీకృతం చేసి, అనుమతుల కోసం పడే సమయాన్ని తగ్గించడం ద్వారా నిర్మాణ రంగానికి ఊతం తీసుకొస్తున్నాయి. అలాగే, ఇప్పటికే ఉన్న భవనాలను ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేసుకునే విధంగా ప్రభుత్వం సానుకూల దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవడం ఎంతో ప్రాముఖ్యంగా మారింది. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం, ప్రజల కోసం, అభివృద్ధి కోసం మీరు తీసుకుంటున్న నిర్ణయాలకు మా పూర్తి మద్దతు ఇస్తామని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ తెలిపారు.

# రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డు అందుకున్న కర్క నాగరాజు

**కూకట్ పల్లి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ కు చెందిన కూకట్ పల్లి నియోజకవర్గం ఐ ఎన్ టి యు సి, పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు కర్కనాగరాజు కు అత్యంత ప్రతిష్టాత్మికమైన రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డు 2026 అందుకున్నారు. కలకత్తా నగరం లోని బెహెల శరత్ సదన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమం లో కర్కనాగరాజు కు అవార్డును భారత మాజీ ఫుట్ బాల్ ప్లేయర్ మెహతాబ్ హుస్సేన్ చేతుల మీదుగా అందుకున్నారు. సోషల్ సర్వీస్, ట్రేడ్ యూనియన్ లీడర్షిప్ కేటగియరీ లో ఎంపికయ్యారు. అనంతరం అవార్డు గ్రహీత కర్కనాగరాజు మీడియా ప్రతినిధిలతో మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ తను చేసిన సామజిక సేవలు, ట్రేడ్ యూనియన్ ద్వారా కార్మికులకు చేస్తున్న సేవలను గుర్తించి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు నన్ను




రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డుకు ఎంపిక చేసినందుకు వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ అవార్డు తో నా పై మరింత భాద్యత పెరిగిందన్నారు. ఈ రోజు నాకు చాలా గర్వంగా, భావోద్వేగంగా ఉంది. రాష్ట్రీయ గౌరవ్ సమ్మాన్ అవార్డు 2026 అందుకోవడం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, నా ప్రయాణంలో నాకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరి సమిష్టి కృషికి గుర్తింపు. కలకత్తా నగరంలో మాజీ భారత మాజీ ఫుట్ బాల్ ప్లేయర్ మెహతాబ్ హుస్సేన్ నుండి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం నాకు చాలా గౌరవంగా ఉంది. ఈ క్షణం నా జీవితంలో అత్యంత చిరస్మరణీయమైన మైలురాళ్లలో ఒకటిగా నిలిచిపోతుంది. సామాజిక సేవ, ట్రేడ్ యూనియన్ నాయకత్వం కోసం ఈ అవార్డు కార్మికుల సంక్షేమం, సమాజ అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా పనిచేయాలనే నా నిబద్ధతను బలపరుస్తుంది. నాయకత్వం అనేది పదవి గురించి కాదు, బాధ్యత, అంకితభావం, సేవ గురించి అని నేను గట్టిగా నమ్ముతున్నాను. ప్రతి సవాలులో నాకు తోడుగా నిలిచిన కార్మికులు, మద్దతుదారులు, నా కుటుంబ సభ్యులందరికీ నేను ఈ గౌరవాన్ని అంకితం చేస్తున్నాను. వారి ప్రోత్సాహం, నమ్మకం నా గొప్ప బలం. నా ప్రయత్నాలను గుర్తించినందుకు అవార్డు నిర్వాహకులకు కూడా నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ గుర్తింపు నన్ను మరింత అభిరుచి, సమగ్రతతో పనిచేయడం కొనసాగించడానికి ప్రేరేపిస్తుంది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెంగాలీ సినీ నటులు, రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పలపహాడ్ గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభించిన సర్పంచ్ చిన్నం బీరప్ప

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం ఉప్పలపహాడ్ గ్రామంలో ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆలేరు అభివృద్ధి ప్రదాత బీర్ల ఐలయ్య సహాయ సహకారాలతో గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి10 లక్షల నిధులతో గ్రామ సర్పంచ్ చిన్నం బీరప్ప చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి సిసి రోడ్డు సోమవారం రోజు ప్రారంభించారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ మరియాల స్వరాజ్యలక్ష్మి,వార్డు సభ్యులు గంగాపురం పరమేష్,రాంపాక నరసయ్య,తీగల స్వప్న,లోడే సునీత,తాజామాజీ ఎంపిటిసి మరియాల వెంకటేశ్వర్లు,గ్రామ కార్యదర్శి నిడిగొండ శ్రీనివాస్, కారోబార్ కడకంచి ఆంజనేయులు,గ్రామస్తులు సుదర్శన్ రెడ్డి,మహబూబ్, కడకంచి యాదయ్య,లగ్గాని రమేష్,లోడే శ్రీకాంత్,గ్రామ ప్రజలు పాల్గొని ప్రత్యేక శ్రద్ధతో సిసి రోడ్డు వేయించినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక రక్షణ కల్పించాలి

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** సాంకేతిక విప్లవం నేపథ్యంలో ఉద్భవించిన గిగ్ ఎకానమీలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అసెంబ్లీలో ప్రస్తావించారు. ఉబార్,ఓలా, స్విగ్గి,జోమోటో వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సేవలు అందిస్తున్న యువత నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల అవసరాలను తీర్చడంలో గిగ్ వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి సరైన ఉద్యోగ భద్రత లేదు.ప్రమాదాలు జరిగినప్పుడు ఆదుకునే నాథుడు లేక అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఆరోగ్య భీమా,పెన్షన్ మరియు



ప్రమాద భీమా వంటి కనీస సామాజిక భద్రతా సౌకర్యాలు వీరికి అందడం లేదు.గిగ్ వర్కర్లను కేవలం'భాగస్వాములు' (పార్టనర్స్)గానే చూడకుండా, వారిని కార్మికులుగా గుర్తించి ప్రత్యేక విధానాలను రూపొందించాలి. వారికి వర్తించేలా ప్రమాద భీమా మరియు ఆరోగ్య భీమా పథకాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి.సమాజంలో అంతర్భాగంగా ఉన్న ఈ అసంఘటిత రంగ కార్మికుల కష్టాన్ని గుర్తించి, ప్రభుత్వం వారి ఉజ్వల భవిష్యత్తు కోసం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను.



## జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన కొండపురం సర్పంచీకి శుభాకాంక్షలు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం)మార్చి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకోండూర్ మండలం కొండపురం గ్రామ సర్పంచ్ కొప్పుల(చిన్న)వెంకట్ రెడ్డి జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా వారికి కొండపురం గ్రామం విజయపాల కొనుగోలు కేంద్రం చైర్మన్ కొప్పుల (పెద్ద)వెంకట్ రెడ్డి, కొనుగోలు కేంద్రం సభ్యులు,వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.






## మార్చి 23 నుండి 30 వరకు భగత్ సింగ్ వర్ధంతి సభలను జరపండి

### పిడిఎస్యు పివైఎల్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

దేశ స్వాతంత్ర్య పోరాటంలో పోరాడి తమ ప్రాణాలర్పించిన భగత్ సింగ్,రాజగురు, సుఖదేవుల 95 వ వర్ధంతి సభలను ప్రతి గ్రామ గ్రామాన మార్చి 23 నుండి 30 వరకు జరపాలని పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఆర్.ఉదయ్,పి వై ఎల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎలగందుల సిద్ధులు పిలుపునిచ్చారు.భగత్ సింగ్ వర్ధంతి సభ పోస్టర్లను ఆలేరులో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉదయ్,సిద్ధులు మాట్లాడుతూ విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్ రాజ్ గురు,సుఖదేవులు తమ అమూల్యమైన ప్రాణాలను ఈ దేశ స్వాతంత్రం కోసం అర్పించారని,వారి స్ఫూర్తితో నేటి యువత దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదానికి ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని, దేశంలో నిరుద్యోగం పేదరికం పెరిగిపోతుంటే కేవలం మతాన్ని ముస్లింలను బూచిగా చూపించి ప్రజలని తప్పుదోవ పట్టిస్తున్నారని, దేశం అభివృద్ధి చెందడం అంటే దేశంలోని పేదరికాన్ని నిర్మూలించడం, యువతకి ఉద్యోగాలు ఇవ్వడం, ఆర్థిక అసమానతలను తొలగించడం అని ఇవేవీ చేయకుండా కేవలం మత రాజకీయాలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని, ఎక్కడ ఎన్నికలు వస్తే ఆ ప్రాంత వేషం కట్టుకొని ప్రచారానికి దిగుతున్న నరేంద్ర మోడీ డాలర్ రేటు పెరుగుతున్న, గ్యాస్ రేట్లు పెరుగుతున్న, నిత్యవసర ధరలు రేట్లు పెరుగుతున్న వాటి గురించి మాత్రం మాట్లాడటం లేదని, మరోవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి యువతకు యువ వికాసం అంటూ ఒక పథకాన్ని ప్రవేశపెట్టి దాన్ని కేవలం ప్రకటన గానే మిగిల్చారని, ఆ యువ వికాసం ఇంతవరకు ఎలాంటి కార్యాచరణ ప్రకటించలేదని యువతకి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పాత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడంతోటే సమయాన్ని వృధా చేస్తున్నారని, రెండున్నర సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి చేయకుండా హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలుస్తున్నారని,ఇలాంటి ప్రజావ్యతిరేక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బేజాడి కుమార్, మారుజోడు సిద్దేశ్వర్,సాదుల శ్రీకాంత్, శికిలం కుమారస్వామి, వెంకటేష్, ఆకుల కృష్ణ, తమ్ముడి అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# చౌటుప్పల్ లో బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలి

**కలెక్టర్ కు వినతి పత్రం అందజేత**

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు**



**చౌటుప్పల్,మార్చి 23, క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి జిల్లా,చౌటుప్పల్ పట్టణంలో వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రజావాణిలో చౌటుప్పల్ పట్టణంలో వెనుకబడిన తరగతుల బాలుర కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల అధ్యక్షులు దాసరి ప్రకాష్ తో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ.. హైదరాబాద్ కు అతి దగ్గరలో ఉన్న చౌటుప్పల్ పట్టణంలో కళాశాల వసతి గృహం లేక విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో అనేక జూనియర్ కళాశాలలు ఉన్నాయని,మారుమూల గ్రామాల నుండి విద్యార్థులు రోజు 3000 నుండి 5000 మంది విద్యార్థులు చదువుకోవడానికి నిత్యం చౌటుప్పల్ పట్టణానికి వస్తుంటారని తెలిపారు.గ్రామాల నుండి సరైన బస్సు సౌకర్యం లేక విద్యార్థులు సమయానికి కళాశాలలకు చేరుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాల వసతిగృహం ఉంటే దానిలో విద్యార్థులు చదువును అభ్యసించడం జరుగుతుందని,కావున ప్రభుత్వం వెంటనే స్పందించి చౌటుప్పల్ పట్టణంలో బాలుర కళాశాల వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్ కు వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు.



## బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి

**ఎస్ కే డి కే వై యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం**

**కూకట్ పల్లి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్) :** వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మోటిపల్లి భరత్ కుమార్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి డివిజన్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఎస్ కే డి కే వై యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనునిత్యం రద్దీగా ఉండే టెంపుల్ బస్ స్టాప్ లో బాటసారిలకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, తుమ్మల మోహన్ కుమార్, సాయి, సందీప్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర శాసన మండలి విప్ గా ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ నియామకం

**కష్టపడే నాయకత్వానికి ఎల్లప్పుడు విజయం వరిస్తుంది**

**తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ నాయకులు గొల్ల జాన్**



**కూకట్ పల్లి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్) :** విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రజా సేవలో ఎదిగి, విద్యార్థుల ఆశయాలను సాకారం చేసే నాయకుడిగా నిలిచి ఎమ్మెల్సీ గా, నేడు తెలంగాణ శాసన మండలిలో ప్రభుత్వ విప్ గా నియమితులైనా బల్మూర్ వెంకట్ కి హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ మీ నాయకత్వానికి, అంకితభావానికి ఈ పదవి నిదర్శనం అని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ నాయకులు గొల్ల జాన్ అన్నారు. ఈ బాధ్యతల్లో మరింత విజయాలు సాధిస్తూ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. కష్టపడే నాయకత్వానికి ఎప్పుడూ విజయం తోడుంటుందని, వెంకట్ బాల్మూర్ విప్ పదవి అదే సాక్ష్యం అని అన్నారు. నిరంతర శ్రమ, అంకితభావం, పార్టీ పట్ల నిబద్ధత, ఇవే వెంకట్ బాల్మూర్ ని ఈ స్థాయికి తీసుకువచ్చాయని, మీ కృషికి వచ్చిన ఈ గుర్తింపు, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలకు నడిపించాలని ఆయన ఆకాంక్షించారు.

## మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసింది

**బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**



కూకట్ పల్లి, మార్చి 23 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్, భూదేవి హిల్స్ కాలనీలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ ను తన నివాసం వద్ద జగద్గిరిగుట్ట పోలీసులు చలో అసెంబ్లీ కార్యక్రమానికి పోనివ్వకుండా ఉదయాన్నే నిద్రలేపి అక్రమ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేదోళ్ల బ్రతుకులు మారుస్తామని చెప్పి 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను గాడి తప్పించి ఇప్పుడు పేదోళ్ల పొట్టకొట్టే విధంగా వ్యవహరిస్తున్నది అన్నారు. కాంగ్రెస్ ముమ్మాటికి ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి సర్కార్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసింది అన్నారు. 6 గ్యారంటీలను పక్కనపెట్టి హైడ్రా ను తీసుకొచ్చి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడి రాక్షసానందం పొందిన దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అన్నారు. గ్రేటర్ పరిధిలో ఉన్న వివిధ డివిజన్ లలో సమస్యలు చెత్తకుప్పల పేరుకుపోయాయని గత కార్పొరేటర్లు తాజా మాజీలు అయ్యారే తప్ప డివిజన్లను తాజాగా చేయలేదన్నారు. ప్రజలు ఇప్పటికైనా అర్థం చేసుకొని మోసపూరిత వాగ్దానాలిచ్చి ప్రజల్ని మోసం చేసిన కాంగ్రెస్ నాయకులను మూడు కార్పొరేషన్లలో ఉన్న ప్రజలు తరిమికొట్టాలని అన్నారు.

## షహీద్ భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్లు తమ ప్రాణాలను దేశం కోసం తృణ ప్రాయంగా అర్పించిన రోజు



**వారికి విప్లవ జోహార్లు**

**సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం**

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ళ గ్రామం సోమవారం రోజున సిపిఎం పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95 వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం గ్రామశాఖ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా వేముల బిక్షం మాట్లాడుతూ అంతరాలు, వివక్షతలు లేని,శ్రమ దోపిడీ లేని సమ సమాజం కావాలని పోరాడి ఉరికొయ్యలకు ఉయలలూగిన విప్లవ వీర కిశోరాలు నిజమైన దేశభక్తులు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ లు మనకు దూరమైన రోజు.వారికి ఇవే మా విప్లవ జోహార్లు.ఏదైనా నమ్మే ముందు దానిని ప్రశ్నించాలని, విచక్షణతో ఆలోచించడం ముఖ్యమని, మతం అనేది మనిషి బలహీనతకు సంకేతం అని, మనుషులను విడదీసే వ్యవస్థను భగత్ సింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు.నిజమైన స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలకులు వెళ్ళిపోవడం కాదు, సామాన్యుడు,కార్మికుడు,రైతూ ప్రతి ఒక్కరూ దోపిడీకి గురికాకుండా జీవించగలగడమని నమ్మారు భగత్ సింగ్.వారి ఆశయాల కొనసాగింపులో పనిచేద్దాం. ప్రజలను దోపిడీ చేస్తున్న పాలకుల విధానాలపై పోరాడుదాం.జోహార్ భగత్ సింగ్, రాజు గురు,సుఖిదేవ్ లకి జోహార్.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య,ఉపసర్పంచ్ హనుమంతుల రమేష్,గడ్డం రవి, వడ్లకొండ బిక్షపతి,రమేష్, పొన్నం అండాలు ,మంగమ్మ,మల్లమ్మ, అండాలు,పద్మ, తదితరులు పాల్గొన్నారు.




## అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో సోమవారం రోజు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమటి పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం గత ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కానీ 6 గ్యారెంటీ లు 432 హామీలను నెరవేర్చలేదు.ఈ సందర్భంగా ఆత్మకూరు(ఎం)ఉపసర్పంచ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ మోసపూరితమైన హామీలు అయిన అమ్మాయి వివాహానికి తులం బంగారం, స్కూటీల పంపిణి,ప్రతి మహిళలకు 2500 భృతి, వృద్ధులకి 4000 పెనషన్ పెండింగ్,నిరుద్యోగ యువతకి ఉపాది కల్పన చేయకపోవడం, రైతు భరోసా సమర్థవంతగా నిర్వహించకపోవడం, రిటైర్డ్ ఉద్యోగుల విషయంలో ఇబ్బంది పెట్టడం ఇలా ప్రతి వర్గానికి అన్యాయం చేస్తూ రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికలలో ఎదో ఒక సాకుతో ప్రజలను మోసం చేస్తున్నారని అయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య,మండల నాయకులు మద్యల బాలనర్షయ్య,లోడి మహేష్,పంజాల వివేకానంద, జెట్ట కిరణ్,గవ్వల లక్ష్మణ్, తదితరులు అరస్ట్ అయినారు.

## నామకరణ వేడుకల్లో పాల్గొని బాబుని ఆశీర్వదించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం లక్ష్మీదేవి గూడెం గ్రామానికి చెందిన జిలకపల్లి రాజు దంపతుల కుమారుని నామకరణ వేడుకల్లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా గాదె కవిత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చిరంజీవి ఆరోగ్యంగా పెరిగి మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని దివించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గాదె నరేందర్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మన్గా పైళ్ల దామోదర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన చైర్మన్గా ఎన్నికైన పైళ్ల దామోదర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన ఆత్మకూరు(ఎం)గ్రామ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, బబ్బురి శివలింగం, పరకాల రాంబాబు, పైళ్ళ ప్రశాంత్, లోడి మహేష్, గవ్వల లక్ష్మణ్, బొజ్జ పవన్, తదితరులు ఉన్నారు.

## భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా బహుమతులు అందచేత

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** భారతీయ జనతా పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ కే లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి భువనగిరి పార్లమెంట్లో జరిగిన "ప్రధానమంత్రి సంసద్ ఖేల్" మహోత్సవంలో భాగంగా కబడ్డీ,వాలీబాల్,క్రికెట్,కోకో మరియు క్రీడల్లో ప్రథమ,ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్న క్రీడాకారులకు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ప్రథమ ద్వితీయ బహుమతులు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగ మోత్కూర్ మండలం దత్తప్పగూడ గ్రామానికి చెందిన క్రీడాకారులు వాలీబాల్ ప్రథమ బహుమతి,కబడ్డీ ద్వితీయ బహుమతి గెలుచుకున్న సందర్భంగా 75000 నగదు అందజేశారు.వారందరికీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుంగతుర్తి ఇన్చార్జ్ కడియం రామచంద్రయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి,జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్,మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు గూదే మధుసూదన్ యాదవ్, ఉపాధ్యక్షులు గుంటి సతీష్, రాధారపు మల్లేష్,తదితరులు ప్రత్యేక హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.



# బ్రిటీష్ పాలకుల సింహ స్వప్నం భగత్ సింగ్

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్




**రామకృష్ణాపూర్ మార్చి 23 (క్రైమ్ మిర్రర్):** బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తన పోరాటంతో గడగడలాడించిన విప్లవ వీరుడు అమరజీవి సర్దార్ భగత్ సింగ్ అని, ఆయన ఆశయ సాధన కోసం యువత ముందుకు సాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం సిపిఐ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.కె 4 గడ్డ నుండి రాజీవ్ చౌక్ వరకు భారీ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ఎండి అక్బర్ అలీ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ వీరోచిత పోరాటాలు అజరామరమని కొనియాడారు. భగత్ సింగ్ పేరు వింటేనే బ్రిటిష్ పాలకులు వణికిపోయేవారని, ఆంగ్లేయ ప్రభుత్వానికి ఆయన ఒక సింహస్వప్నంగా నిలిచారని పేర్కొన్నారు. లాహోర్ కుట్ర కేసులో 1931 మార్చి 23న కేవలం 23 ఏళ్ల ప్రాయంలోనే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లను బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిందని గుర్తుచేశారు."ఉరిశిక్షకు ముందు ఆఖరి కోరికగా భగత్ సింగ్ రష్యా విప్లవ నేత లెనిన్ రాసిన పుస్తకాన్ని చదవాలని కోరారు. చనిపోయే నిమిషం ముందు వరకు కూడా జ్ఞానాన్ని సముపార్జించిన గొప్ప యోధుడు ఆయన. 'వతన్ కేలియే సర్ పరిస్థితికి తమన్న ఆబ్ అమార దిల్ మే హై' అంటూ దేశం కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధమయ్యారు" అని నేతలు వివరించారు. ఉరికొయ్యను ముద్దాడే సమయంలోనూ 'ఇంకిలాబ్ జిందాబాద్' అంటూ నినదించి దేశ యువతలో స్ఫూర్తిని నింపారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి, ఎగుడ మొండి, కాదండి సాంబయ్య, మామిడి గోపి పాల్గొన్నారు. అలాగే ప్రజా సంఘాల నాయకులు గుమాస మల్లేష్, అన్నం శ్రీనివాస్, మోతుకుల రాజు, మేరుగు రాజేశం, గాండ్ల సంపత్, హరిరామ కృష్ణ, బోయపోతుల కొమురయ్య, మారపెల్లి రవి, మాదాస్ శంకర్, మండల శ్రీనివాస్, పోతర్ల రాములు, గుమ్ముల శ్రీనివాస్, దేవానంద్, రామడుగు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## మోడల్ స్కూల్ లో ఉచిత వైద్య శిబిరం

**సశీస్థాన్ నారాయణపురం, మార్చి 23(క్రైమ్ మిర్రర్):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సశీస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తనమూనాలు సేకరించి టెస్టులు చేశారు. అదేవిధంగా సీఆర్పీ, ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళజోడులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డాక్టర్లు పాండురంగం(పీడియాట్రీషియన్) కవిత( గైనకాలజిస్ట్) , శ్రీలక్ష్మి( డెంటిస్ట్), సుమంగళి (డెంటిస్ట్)శ్రీదేవి (అప్తల్మజిస్ట్ ) దీపక్, మౌనిక, పద్మ, అనిత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కే. దీప జ్యోషి తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ రైతులకు సాగునీటి భరోసా కల్పించాలి: సురపల్లి శివాజీ డిమాండ్



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 23(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల రాచకొండ రెవెన్యూ పరిధిలోని 32 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇబ్రహీంపట్నం చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని, అలాగే రాచకొండ లో 6 టీఎంసీల సామర్థ్యంతో నీటి ప్రాజెక్టును నిర్మించాలని బీజేపీ మాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు సురపల్లి శివాజీ డిమాండ్ చేశారు. సాగునీటి వసతి లేక ఈ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతులు, 30కి పైగా తండాల గిరిజనులు వ్యవసాయం వదిలి పట్టణాలకు వలస వెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఈ ప్రాజెక్టును చేపట్టాలని, తద్వారా ఈ ప్రాంత రైతుల బతుకులు మారుతాయని ఆయన ఓ ప్రకటన లో విన్నవించారు

## భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం: నేతాజీ యువజన సమాఖ్య

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 23(క్రైమ్ మిర్రర్):** స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 95వ వర్ధంతిని పురస్కరించుకొని సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నేతాజీ యువజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి పబ్బు మాధవులు మాట్లాడుతూ, బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం ఉరికొయ్యను ముద్దాడిన ఆయన త్యాగం అజరామరమని పేర్కొన్నారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో పయనించి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, రుద్ర రాములు,కర్నాటి మారయ్య,కట్ల పద్మచారి, రాపార్తి సత్యనారాయణ, బచ్చనగోని గాలయ్య,దుబ్బాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు



# భగత్ సింగ్ దేశభక్తి యువతకు ఆదర్శం




**చౌటుప్పల్,మార్చి 23,ప్రైమ్ మిర్రర్ :** భగత్ సింగ్ స్ఫూర్తితో అసమానతలు లేని సమాజంకై ముందు కు సాగుదామని ఏఐవైఎఫ్ జిల్లా వర్కిం గ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్ అన్నారు. సోమవారం భగత్ సింగ్ 95 వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమా ల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండూరి వెంకటేష్ మాట్లాడుతూ... భారత స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భగత్ సింగ్ చేసిన పోరాటం,త్యాగం అజరామరామని పేర్కొన్నారు. భారతదేశాన్ని వందల ఏళ్లుగా పట్టిపీడిస్తున్న ఆంగ్లేయుల పెత్తనాన్ని ఎదిరించి,పరాయి పాలన నుండి విముక్తి చేసిన వీరుడు భగత్ సింగ్ అని, 23 ఏళ్ళ వయసులోనే చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడి తన దేహం కన్నా దేశమే ముఖ్యమని, భారతదేశంలో కుల, మత, ప్రాంత విద్వేషాలు లేకుండా దేశంలోని ప్రజలంతా ఒకటేనని చాటి చెప్పినా మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. భగత్ సింగ్ వర్ధంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. అలాగే భగత్ సింగ్ కు భారతరత్న అవార్డును ప్రకటించాలని అన్నారు. భారతదేశంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ శాఖ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, బద్దుల సుధాకర్, రొండి నర్సింహా, టంగుటూరు రాములు, దాసరి మనోహర్, దాసరి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మార్చి30న జరుగు నిరహార దీక్షలు జయప్రదం చేయాలి

### ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి కూరెళ్ల రమేష్ మాదిగ



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ ఆదేశానుసారం జిల్లా ఇన్చార్జి కూరెళ్ళ రమేష్ మాదిగ ఆధ్వర్యంలో మార్చి 30తారీఖున హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరుగు నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని కరపత్రికలను ఆవిష్కరించడం జరిగింది. ఈకార్యక్రమంను ఉద్దేశించి కూరెళ్ళ రమేష్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అంబేద్కర్ అభయస్థం పేరు మీద 12 లక్షల రూపాయలు ఇస్తానన్న మాట నిలబెట్టుకోవాలని అలాగే ఎస్సీ కార్పొరేషన్ 15,000 కోట్లు కేటాయించాలని బ్యాంకు లింకేజ్ లేకుండా నిరుద్యోగ యువతకు లోన్లుఇవ్వాలని మాదిగల అసైన్మెంట్ భూములకు పక్కపట్టా పాసుబుక్కులు మారుస్తానని చెప్పిన మాట ప్రకారం పట్టాగా మార్చాలని మార్చి 30న హైదరాబాద్లోనీ ఇంద్రపార్క్ వద్ద జరుగు ధర్నాకు వేలాదిగా తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వస్తుపుల ఎల్లయ్య,మండల అధికార ప్రతినిధి బొట్ల అనిల్ ,జిల్లా సహాయ కార్యదర్శి కొంగరి రామచంద్ర,ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి వెంకట్, యువసేన మండల అధ్యక్షుడు ఉప్పల్ నర్సయ్య,మండల కార్యదర్శి గాదె ఎల్లేష్,మేకల నరసయ్య,గజ్జెల్లి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## బీఎస్బి డిజిటల్ ఫ్లెక్సీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టిజెఎ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిఎస్బి డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా. అనంతరం బిఎస్బి డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ అధినేతలు భాస్కర్,శంకర్, భాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో పాటు ఎస్ఆర్ ఫ్లెక్సీ అధినేతలు శ్రీకాంత్, మధు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన శాసనసభ శాసనమండలి సభ్యులు



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 23:** రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా శాసనమండలి,శాసనసభ ప్రభుత్వ విప్‌లు,పలువురు ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో జరిగిన రైతు ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రైతు భరోసా మొదటి విడతగా విడుదల చేసిన నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి."దేశానికి వెన్నెముక రైతు ఆ వెన్నెముకను కాపాడే బాధ్యత అందరిది. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న ఆర్థిక సహాయం కేవలం పెట్టుబడి మాత్రమే కాదు, అది అన్నదాతల ఆత్మగౌరవానికి దక్కే గౌరవం. వ్యవసాయం పండుగ కావాలి, రైతు ముఖంలో చిరునవ్వు నిలవాలి అని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారం

గ్రీవెన్స్ డే నిర్వహించిన జిల్లా ఎస్పీ పవార్.



**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా, నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం, గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన, దాదాపు 35 మంది ప్రజలు తమ వ్యక్తిగత, ఆర్థిక, భూ సంబంధిత సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రతి ఒక్కరి ఫిర్యాదును విని, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు భయపడకుండా పోలీస్ శాఖను సంప్రదించాలని తెలిపారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత వేగం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

## బెల్లి జనార్ధన్ కు పూలమాల వేసి నివాళులర్పించి: దైద రవీందర్

**నకిరేకల్ క్రైమ్ మిర్రర్:** నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన తన ఆత్మీయ మిత్రుడు ఇంటర్ క్లాస్ మేట్ అయిన బెల్లి జనార్ధన్ యాదవ్ ప్రమాదవశాత్తు మరణించగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గార్లపాటి రవీందర్ రెడ్డి నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకరబోయిన నరసింహ యాదవ్ కట్టంగూర్ మండలం మాజీ జడ్పిటిసి ముక్కాముల శేఖర్ సర్పంచ్ కట్టంగూర్ చింత పున్నమయ్య పాలెం గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బెల్లి శేఖర్ యాదవ్,రాజు,మాచర్ల జానయ్య, రవి, యాదగిరి, శేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 మంగళవారం 24-3-2026

# సామ్రాజ్యవాదం,మతోన్మాదంపై పోరాటమే భగత్ సింగ్‌కు ఘన నివాళి: సిపిఎం

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** సామ్రాజ్యవాదం,మతోన్మాదంపై పోరాడటమే భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ దేవ్ లకు మనమిచ్చే ఘన నివాళి అని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అమరుల 95 వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా భగత్ సింగ్,రాజ్గురు సుఖదేవ్ ల చిత్రపటాలకు కి పూలమాలవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ వందేళ్ల క్రితం బ్రిటిష్ సామ్రాజవాదానికి వ్యతిరేకంగా బ్రిటిషర్ల దోపిడీ,పీడనల నుండి విముక్తి కావాలని 23 సంవత్సరాల అతి చిన్న వయసులో వారిని ఎదిరించి భారతదేశ ప్రజల హృదయాల్లో స్వాతంత్ర్యకాంక్షను రగిలించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అయన స్నేహితులు రాజ్ గూర్,సుఖ్దేవ్ లు అని వారి స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి నేడు వెర్రిపుంతలు తొక్కుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.నాడు భగత్ సింగ్ కేవలం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి విముక్తి పొందడమే కాకుండా స్వాతంత్ర్య అనంతరం స్వదేశి దోపిడీ,పీడనల నుండి విముక్తి కావాలని కోరుకున్న ఏకైక స్వాతంత్ర ఉద్యమకారుడని గుర్తు చేశారు,నాడు భగత్ సింగ్ చెప్పినట్లు నేడు స్వదేశంలో దోపిడీ,పీడనలు ,దౌర్జన్యాలు,కొనసాగుతున్నాయన్నారు,ఒక వ్యక్తి మరొక వ్యక్తిని ఒక జాతి మరొక జాతిని దోపిడీ చేసే విధానంలో మార్పులు వచ్చేదాకా విప్లవం ఉంటుందని విప్లవం అజేయమంటూ నినదించిన గొప్ప ముందుచూపు కలిగిన విప్లవకారుడని గుర్తు చేశారు నేడు దేశంలో కొనసాగుతున్న అసమానతలకు, సామ్రాజ్యవాదానికి మతోన్మాదానికి పెట్టుబడుదారి విధానానికి వ్యతిరేకంగా పోరాడే అనేకమంది భగత్ సింగ్ లు నేడు సమాజానికి అవసరం ఉందని వారి స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాల్లో యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు,సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం,మండల కమిటీ సభ్యులు బూడిదమనమ్మ,పిఎన్ఎం మండల అధ్యక్షులు రుద్ర పల్లి రామలింగం,ఐద్వా పట్టణ కార్యదర్శి శీలం ఇందిర,నాయకులు కొండూరు సత్తయ్య, కొమ్ముస్వామి ,ఎల్లయ్య,బూడిద సైదులు,తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులు-- చలో హైదరాబాద్

### ప్రభుత్వ వివక్షకు నిరసనగా... 25 న జర్నలిస్టుల -చలో హైదరాబాద్

**జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య పిలుపునిచ్చారు**



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి :మార్చి -23:** ఖమ్మం ప్రభుత్వ వివక్షకు నిరసనగా... 25 వ తేదీన జర్నలిస్టుల 'చలో హైదరాబాద్'; పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జర్నలిస్టులకు పిలుపు: మామిడి సోమయ్య, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడుఈ నెల 25 వ తేదీన ఉదయం 11:00 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా 'చలో హైదరాబాద్---ఐ అండ్ పీఆర్ ఆఫీస్' నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యం, వివక్షాపూరిత వైఖరికి నిరసనగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లలో పాత్రికేయ వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల చూపుతున్న తీవ్ర వివక్షకు ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ స్పష్టమైన సాక్ష్యమని ఆయన నొక్కి చెప్పారు. బడ్జెట్‌లో పాత్రికేయుల సంక్షేమం గురించి, వారి శ్రేయస్సు గురించి ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం దిగ్భ్రాంతికరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, పాత్రికేయులకు కనీస కొత్త అక్రిడిటేషన్ కార్డులు లేదా ఆరోగ్య కార్డులు కూడా జారీ చేయడంలో విఫలమైందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పాత్రికేయులకు గృహ స్థలాల కేటాయింపుపై అసలు చర్చ జరగడం లేదని, సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి ఈ స్థలాలను అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పించుకుంటోందని ఆయన ఆరోపించారు. మీడియా అకాడమీకి ఇంకా పాలక మండలిని ఏర్పాటు చేయకపోవడాన్ని ఆయన విమర్శించారు. అనేక ఇతర రాష్ట్రాల్లో పదవీ విరమణ చేసిన పాత్రికేయులు పింఛన్లు పొందుతుండగా అది చూసి కూడా మన పాలకులు మన రాష్ట్రంలో ఉన్న విలేకరులపై సవితి తల్లి ప్రేమ కురిపిస్తున్నారు.

# చెరువుల అభివృద్ధి పేరుతో జరిగిన అవినీతిపై విచారణకు సిద్ధమేనా

### గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో అవినీతి పాలన సాగించారు : బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలో అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుతం విజిలెన్స్, ఏసీబీ విచారణ కొనసాగుతున్న ఈ విషయాన్ని ఆధారంగా చేసుకుని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసరంగా బురదజల్లే ప్రయత్నం చేయడం ఖండనీయమని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సభితా ఇంద్రారెడ్డి మంత్రిగా ఉన్న కాలం నుండి ఇప్పటి వరకు బడంగ్‌పేట్ ప్రాంతంలో జరిగిన పనులు, తీసుకున్న నిర్ణయాలు అన్నీ ఆమెకు తెలియకుండా జరిగాయా, ఒక మున్సిపాలిటీ పరిధిలో ఏ పని జరిగినా తీర్మానాలు, అనుమతులు, అధికారుల సమక్షంలోనే జరుగుతాయి. అప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆమెకు ఈ వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉండటం సహజం కాదా అని ప్రశ్నించారు. ఆ కాలంలో పనిచేసిన అధికారులు శ్రీనివాస్ రెడ్డి, సత్యబాబు, కృష్ణమోహన్ రెడ్డి, సుమన్ రావు, రఘు, త్రిల్లేశ్వరరావు, ప్రస్తుతం కొనసాగుతున్న సరస్వతి వరకు కూడా ఆమె హయాంలోనే విధులు నిర్వహించారని, అప్పుడు జరిగిన పనులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఆ అధికారులపై ఏసీబీ, విజిలెన్స్ ద్వారా పూర్తి స్థాయి విచారణ జరిపించే ధైర్యం సభితమ్మకి ఉందా, వార్డ్ వారీగా జరిగిన పనులపై సమగ్రంగా ఎంక్వయిరీ చేయించేందుకు సిద్ధమా అని, గతంలో తన అనుచరులకు లాభాలు చేకూర్చే విధంగా అధికారులను తప్పుదోవ పట్టించి, పనులలో అవకతవకలు జరిగేలా చేసి, ఇప్పుడు అదే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపడం రాజకీయ నైతికతకు విరుద్ధమని,100% పనుల్లో 75% నిధులు దోచుకుని, 25% పనులు కూడా సరిగా చేయని పరిస్థితులు ప్రజలకు తెలియనివి కావు అని, అలాగే చెరువుల సుందరీకరణ పేరుతో చెరువుల అభివృద్ధి పేరుతో నిధులు దుర్వినియోగం చేసి, తన అనుచరులకు లాభాలు చేకూర్చిన పరిస్థితులపై ప్రత్యేక విచారణకు సిద్ధంగా ఉన్నారా? ఆ పనులపై కూడా ఏసీబీ, విజిలెన్స్ ద్వారా పూర్తి స్థాయి ఎంక్వయిరీ జరిపించేందుకు సభితమ్మ ముందుకు రావాలనే మా డిమాండ్ అని, శిలాఫలకాలకే ప్రాధాన్యత ఇస్తూ, వాస్తవ అభివృద్ధిని శూన్యంగా మార్చిన వారు ఈ రోజు అభివృద్ధి గురించి మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని, పేరుకే కార్యక్రమాలు చేసి, ఫలితాలు లేని పాలనను ప్రజలు మరచిపోరని, ఇది శాశ్వతంగా గుర్తుండే విషయమని, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో విచారణకు సహకరిస్తుందని స్పష్టం చేస్తూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపించి, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షించే వరకు పోరాటం కొనసాగిస్తామని, ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని హెచ్చరించారు.

# శ్రీ గుండుమల్లన్న స్వామి జాతర ముగింపు: భక్తుల నీరాజనం.. ఆదాయం లక్షల్లో!

### ఆలయ కమిటీ శ్రమకు దక్కిన ఫలితం.. ప్రజాప్రతినిధుల తీరుపై భక్తుల చర్చ

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం తిరుమలాపురం (పిడి) గ్రామంలో వెలసిన స్వయంభూ శ్రీ గుండుమల్లన్న స్వామి వారి ఉగాది జాతర ఉత్సవాలు భక్తిప్రపత్తుల మధ్య ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో స్వామివారికి భక్తులు భారీగా కానుకలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో స్వామివారికి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో జరిగిన లెక్కింపు ప్రకారం వివరాలు ?నగదు రూపంలో: హుండీ ద్వారా 86,774, ఎడ్లబండ్ల పోటీలు, పట్నాలు, బోనాలు మరియు టెంకాయల టిక్కెట్ల ద్వారా 43,360 లభించాయి.?మొత్తం ఆదాయం: 1,30,634 (అక్షరాలా ఒక లక్ష ముప్పై వేల ఆరు వందల ముప్పై నాలుగు రూపాయలు).కానుకలు: బంగారు ఆభరణాలు (0.100 మిల్లీ గ్రాములు), వెండి (21 గ్రాములు) లభించాయి. అలాగే విదేశీ కరెన్సీ రూపంలో సింగపూర్ డాలర్లు (101), దుబాయ్ దిర్హామ్స్ (5) భక్తులు సమర్పించారు. వీటితో పాటు స్వామివారికి వెండి గుర్రాలను భక్తులు కానుకగా అందజేశారు.

**అంటీముట్టనట్టు వ్యవహరించిన పాలకవర్గం.. ప్రజల్లో చర్చ!**

గ్రామంలో జాతర నిర్వహణలో స్థానిక పాలకవర్గ పెద్దల తీరు మాత్రం చర్చనీయాంశంగా మారింది. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చే ఈ మహా జాతరలో అగ్రభాగాన నిలబడి పర్యవేక్షించాల్సిన కీలక ప్రజాప్రతినిధులు.. కేవలం నామమాత్రంగా దర్శనమిచ్చి అంటీముట్టనట్టు వ్యవహరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

"గతంలో ఈ జాతర అంటే పాలకవర్గం మొత్తం ఒక పండుగలా భావించి భక్తులకు సేవలందించే వారు. కానీ ఇప్పుడు మాత్రం కేవలం బాధ్యత నుండి తప్పుకున్నట్లుగా వ్యవహరించడం సరికాదు" అని భక్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా జాతరలో కీలకమైన శోభాయాత్ర వంటి కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆలయ కమిటీకి వెన్నుదన్నుగా ప్రజలు:** స్థానిక నాయకత్వం నుండి ఆశించిన స్థాయిలో సహకారం లేకపోయినప్పటికీ, ఆలయ కమిటీ అధ్యక్షులు ఉస్కెమల్ల లచ్చయ్య మరియు సభ్యులు తమ సొంత కృషితో, గ్రామ ప్రజల అండదండలతో జాతరను అంగరంగ వైభవంగా పూర్తి చేశారు. జాతర విజయవంతం కావడానికి సహకరించిన భక్తులకు, గ్రామ ప్రజలకు ఆలయ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.



# సంక్షేమం పక్కన... అంకెల మాయలో బడ్జెట్: బీఆర్ఎస్ నేతలు

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 23:** తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీతో ప్రజలను మోసం చేసే వంచన బడ్జెట్ అని మిర్యాలగూడ బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా విమర్శించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని వారు ఎండగట్టారు.రైతు భరోసా కింద రైతులకు రూ.15 వేల సహాయం అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ విషయాన్ని ప్రస్తావించకపోవడం సిగ్గుచేటని జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. రుణమాఫీకి సరిపడా నిధులు కేటాయించకుండా రైతుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు లభించిన గౌరవం ఇప్పుడు కరువైందన్నారు. వరి సాగు వద్దని, ఆయిల్ పామ్ పండించాలని సీఎం సూచించడం విచిత్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు.ప్రజా నిధులను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని వేములపల్లి మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర మల్లయ్య యాదవ్ అన్నారు. ఈ బడ్జెట్ రైతులు, పేదలు, కార్మికులకు వ్యతిరేకమని నాయకుడు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి విమర్శించారు. బీసీలకు కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రుణాలకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని, కులవృత్తులను ప్రోత్సహించే పథకాలకు నిధులు కోత విధించడం బీసీలపై వివక్షకు నిదర్శనమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నబీమోజు నాగార్జునచారి అన్నారు.దళిత బంధు పథకాన్ని పక్కనబెట్టి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడం దారుణమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధనచిట్టిబాబు నాయక్, మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్ తెలిపారు. గిరిజన తండాల అభివృద్ధికి కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయని అన్నారు.మైనారిటీల సంక్షేమానికి కేటాయించిన నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని మున్సిపల్ కౌన్సిలర్ ఎండి. ఇలియాజ్, సీనియర్ నాయకులు ఖాజా మొయినుద్దీన్, మాజీ వైస్ చైర్మన్ ఎండి. మగ్దుం పాషా, నాయకులు ఎండి. మాజిద్, ఎండి. షోయబ్ విమర్శించారు. గతంలో అమలైన విద్యా, ఉపాధి పథకాలను ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు.ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో వాటికి తగిన నిధులు కేటాయించకుండా ప్రజలను మభ్యపెడుతోందని నాయకులు విమర్శించారు. ఈ బడ్జెట్ అభివృద్ధికి దోహదం చేసేలా లేదని, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టే బడ్జెట్ అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో యడవెల్లి శ్రీనివాసరెడ్డి, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదయ్య యాదవ్, పేరాల కృపాకర్ రావు, చౌగాని బిక్షంగౌడ్, అమరావతి సైదులు, పీసీకే ప్రసాద్, ఐల వెంకన్న, ధనావత్ శంకర్ నాయక్, మాలవత్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# భగత్ సింగ్ ఆశయాలను సాధిద్దాం

### సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 23(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలో వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను సాధిద్దామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యోజన సమైక్య సంఘ సభ్యులు, వార్డ్ మెంబర్లు వివిధ పార్టీల రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తాం

## అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి: మతోన్మాదం మాకొద్దు,

## డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఉప్పల పెల్లి బాలక్రిష్ణ



**సంస్థాన్ నారాయణపురం, మార్చి 23(క్రైమ్ మిర్రర్ ):** దేశ స్వాతంత్రం కోసం, 23 సంవత్సరాల వయసులో , ఉరితాడును, ముద్దాడి, అమరులైన, షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 95 వర్ధంతి సందర్భంగా అల్లందేవిచెరువు గ్రామంలో కాగడాల ప్రదర్శన నిర్వహించి వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనాడు బ్రిటిష్ పాలకుల వ్యతిరేకంగా, పార్లమెంటుపై బాంబు, వేసి తమ నిరసన తెలియచేయాలనుకున్నారు. అనంతరం పారిపోయే అవకాశం ఉన్న, అక్కడున్న సైన్యానికి పట్టుబడ్డారు. ఏండ్ల తరబడి జైల్లో పెట్టడం జరిగిందని వారన్నారు. చివరికి ఒక ఐదు నిమిషాల ముందు ఆయనను ఉరి తీసే ముందు, అధికారులు, మీ చివరి కోరిక ఏంటని, అడిగితే నేను కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను పూర్తిగా చదవలేదు, ఒక ఐదు నిమిషాలు సమయం ఇస్తే, పూర్తి చేస్తాను, ఇదే నా చివరి కోరిక అని అతను చెప్పడం జరిగిందని, కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక చదివి ఇక మీరు ఉరి తీసుకోవచ్చని సెలవిచ్చిన మహనీయుడు, ఆ రకంగా అతను ఉరి తీయబడ్డారు. అతని మరణం భారతదేశంలో ఒక ఉజ్వలమైన విప్లవోద్యమానికి నాంది పలికిందని ఆయన అన్నారు. ఆయన యువతకు ఐకాన్ గా ఉన్నారని, అతని ఆశయా బాటలో, డివైఎఫ్ఐ మొదటి నుండి పోరాడుతున్నదని అన్నారు. అమెరికా సామ్రాజ వాదానికి వ్యతిరేకంగా, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నదని తెలియజేశారు. భవిష్యత్తులో ఈ పోరాటం మరింత ముందుకు తీసుకెళ్తామని పిలుపునించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు గుండు జంగయ్య, వార్డు సభ్యులు గుండు లింగస్వామి, జంగయ్య , గుండు సుధాకర్, నరసింహ, రామకృష్ణ, జనిగల విష్ణు, చందు, బద్దం రిక్కి, తదితరులు పాల్గొన్నారు.



# యువత క్రీడారంగంలో రాణించాలి

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం

## కౌన్సిలర్లు అలె శ్రీలత చిరంజీవి, బత్తుల జయమ్మ దాసు

**చౌటుప్పల్, మార్చి 23, క్రైమ్ మిర్రర్ :** యువత క్రీడారంగంలో రాణించాలని కౌన్సిలర్ ఆలే శ్రీలత చిరంజీవి అన్నారు.చౌటుప్పల్ లో గత వారం రోజుల నుండి భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను అట్టహాసంగా నిర్వహించారు .ఈ టోర్నమెంట్ లో దాదాపు 13 గ్రామాల నుండి పాల్గొన్నారు . సోమవారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఫైనల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా కౌన్సిలర్లు బత్తుల జయమ్మ దాసు, అలె శ్రీలత చిరంజీవి లు పాల్గొని వారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భగత్ సింగ్ స్ఫూర్తితో యువత దేశ సేవలో పాలుపంచుకోవాలని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రీడల రంగంలో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలిపారు.ఈ టోర్నమెంట్ లో మొదటి విజేతగా రంగారెడ్డి ,రెండో విజేతగా శ్రీకాంత్ లు బహుమతులను అతిథుల చేతుల మీదుగా అందుకున్నారు .ఈ కార్యక్రమంలో సిపిఎం మున్సిపల్ నాయకులు బండారి నరసింహ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బోయలింగస్వామి, భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్స్ తూర్పునూరు మల్లేష్ గౌడ్, నక్క లింగస్వామి, లగోని లింగస్వామి, రొట్ట అనిల్ కుమార్, రాజ్ పెరియర్,బోయ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# మాధవినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా వి.రాముడుయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నిక



**గండిపేట(క్రైం మిర్రర్):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 123వ డివిజన్‌లోని మాధవినగర్ కమ్యూనిటీహాల్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వి.రాముడుయాదవ్ ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి ప్రజాసమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ కొత్త కార్యవర్గం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాముడుయాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కాలనీ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా మాధవినగర్ సమగ్రఅభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానని, త్రాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధిదీపాలు వంటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ప్రతి సమస్యను ప్రజలతో కలిసి చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**నూతన కార్యవర్గ సభ్యులు వీరే...:** అధ్యక్షులుగా వి.రాముడుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఈ.బాలేశ్వర్‌రెడ్డి, చీఫ్ అడ్వైజర్‌గా ఎస్.రామానందయ్య, అడ్వైజర్‌గా జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాస్, కుమ్మరి యాదయ్య, కోశాధికారిగా శివారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.నారాయణ రాజు, డి.నర్సింహ్మా, కార్యనిర్వహక కార్యదర్శులుగా బండారి మహేష్, ఏ.చరణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సి.రాహుల్, జి.చెన్నకేశవ, పి.సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

# ఎంజీఐటీలో మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు అనే అంశంపై సదస్సు




**గండిపేట(క్రైం మిర్రర్):** మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సోమవారం మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. యువతలో మానసిక దృఢత్వం ప్రాముఖ్యతను తెలియజేడానికి హైదరాబాద్‌కు చెందిన స్టెడెంట్ ట్రైబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సెమినార్‌లో ఆస్ట్రేలియాకు చెందిన వ్యవస్థాపకురాలు, సీఈవో డాక్టర్ లీసా ఫేహి ఓఏఎం ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో ఒత్తిడిని అధిగమించడానికి ఆచరణాత్మక వ్యూహాలను సమర్థవంతంగా తీసుకోవాలన్నారు. మానసిక దృఢత్వం, భావోద్వేగ స్థితిస్థాపకతను పెంపొందించడంపై సలహాలు అందజేశారు. అధిక ఒత్తిడి ఉన్న వాతావరణంలో స్వీయ సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.సుధాకర్‌రెడ్డి, ఎస్ఏపి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.ఎన్.సత్యసురేష్, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ చట్టం చేయాలి

## ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్

## అసమానతలు లేని సమాజం కోసం యువత పనిచేయాలి

## మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి




**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ–సిపిఐ, అఖిలభారత యువజన సమాఖ్య–ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి కూడలి వద్ద కామ్రేడ్ మారోజు నరసింహ చారి అధ్యక్షతన భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల 95 వర్ధంతి ఘననివాళులుఅర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సరిగంజి వీరస్వామి మాట్లాడుతూ భగత్ సింగ్ చిన్న వయసులోనే తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం ప్రాణాలను అర్పించడం జరిగినది, అని అన్నారు 75 సంవత్సరాల స్వతంత్ర దేశంలో ఇంకా హార్దిక, అసమానతలు వివక్షలకొనసాగుతూనే ఉన్నాయని వీటి పైన యువత పోరాడాలని అసమానతలు లేని సమాజం నిర్మాణం చేయాలని అన్నారు.ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ బ్రిటిష్ కు వ్యతిరేకంగా ఉద్యమించి ఈ దేశ స్వతంత్రం కోసం ఉరికంబన్నీ ముద్దాడిన ఈ గొప్ప స్వాతంత్ర పోరాట యోధులు భగత్ సింగ్ రాజు గురుసుఖ్ దేవులు అని అన్నారు. వారి ఆలోచన విధానాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు.యువత చెడుదారులకు గంజాయి,డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ చట్టం చేసి పార్లమెంట్లో బిల్లు పెట్టి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శీలం స్వామి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ భగత్ సింగ్, రాజు గురు, సుఖ్ దేవ్ ల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ఈ సమాజం కోసం పనిచేయాలని, అదేవిధంగా ఈదేశ రాజకీయాల్లోకి యువత రావాలని అన్నారు.ఈకార్యక్రమంలో సమితి సభ్యులు పోలేపాక యాదయ్య,పులిపల్పుల మల్లేశం, గుండెగాని నాగరాజ్,కట్ల యాదగిరి,మచ్చ లక్ష్మీనారాయణ, కనకబోయిన ఆంజనేయులు, తాలూకా యాదగిరి, కనకబోయిన నందు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు, వాగ్ధానాలు ఇచ్చి ప్రజలను మోసం చేసింది

## రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్: తోకల శ్రీనివాస్‌రెడ్డి



గండిపేట(క్రైం మిర్రర్): అవినీతి, అరాచక, కమిషన్ల పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి బయలుదేరుతున్న క్రమంలో ఆయనను పోలీసులు బలవంతంగా గృహ నిర్భంధం హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక గ్యారెంటీల పేరుతో 420 హామీలు, వాగ్ధానాలను ఉంచి ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తుందన్నారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలకు న్యాయం జరిగే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు, ఉద్యమాలు ఉదతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టులతో భయపడేది లేదని ప్రజల కోసం ఎంత దూరమైన వెళ్తామన్నారు. ప్రజల సమస్యలు, ఇచ్చిన హామీలు తీర్చలేక అసలు ప్రభుత్వం దగ్గర జవాబు లేక అరెస్టులు చేయడం చేతగానితనం అన్నారు. దొంగ మాటలు చెప్పి సంవత్సరాలు గడిచిపోయిందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నరని బీజేపీ పార్టీ తగిన బుద్ధి చెప్తుందని అన్నారు. నాయకులు రావుల భాస్కర్, తలారి చిన్న, బబ్లూ, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, బొల్ల రామకృష్ణ, ఏన్ను శంకర్‌రెడ్డి, హరినాథ్, పోప్పట్ తదితరులు పాల్గొన్నారు.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.